జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 10

మే 16-31, 2018




## కొంతైనా ఆలోచన చేయండి!



# ఉక్కు ప్రధానిగానా ? ఉత్త ప్రధానిగానా ?




## కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ ప్రభుత్వంగా మారాలి




## పౌరసేవల చట్టం కోసం పార్టీలు ఏకమవ్వాలి

GAYATRI
Degree & PG College
(Affiliated to SV University)

# 2018 డిగ్రీ ఫలితాలలో S.V.U. నెం.1 గాయత్రి డిగ్రీ & పి.జి.కళాశాల

| Ist Sem | | | IIIrd Sem | | | Vth Sem | | |
|---|---|---|---|---|---|---|---|---|
| B.Sc., | Ist Sem 126 Distinctions | B.Com | B.Sc., | IIIrd Sem 116 Distinctions | B.Com | B.Sc., | Vth Sem 144 Distinctions | B.Com |
| 1 RANKER 98% | | 1 RANKER 90% | 1 RANKER 96% | | 1 RANKER 93% | 1 RANKER 96% | | 1 RANKER 96% |
| A.Kavya MECS | | C.Gayathri (B.Com) M.Sasi Kala (B.Com) | S.Keerthana Selvi MECS | | K.Yamini Priya B.Com | M.Teresa Tejaswini (BCCA) K.Mahima (MECS) | | A.Prathima B.Com |

**B.Sc.,**
Maths - 100/100 - 79
Statistics-100/100-12
Electronics-100/100-10
Biotech - 99
Chemistry - 99
Computers-95

**B.Com**
Accounts-100/100-12
B.O.-95
Business Statistics-97

నిజమైన ఫలితాలు ప్రదర్శించడం మా ప్రత్యేకత

B.Sc., మరియు B.Com నందు
386 డిస్టింక్షన్స్, 61 ప్రథమ శ్రేణి పొందిన
ఏకైక విద్యాసంస్థ గాయత్రి డిగ్రీ & పిజి కాలేజ్

**HOSTEL FACILITY**
**for Boys & Girls**
**Bus Facility**

## Courses Offerred

| | |
|---|---|
| B.Sc., | Biotech, Chemistry, Comp.Appl., |
| | Maths, Electronics, Computer Science |
| | Maths, Statistics, Computer Science |
| B.Com | Comp.Application |
| P.G. | M.Com (General) |

శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ దాసిన అవుతుంది.
అడ్మిషన్లు జరుగుచున్నవి

Correspondent
**P.Ravi Venkatesh,** B.E.,

Chairman
**P.Mallikarjuna Setty**
(Retd) Depty.Transport Commissioner


**GAYATRI**
**DEGREE & PG COLLEGE**
(Affiliated to S.V.University)
#164, Prakasam Road, Tirupati-517501.
Ph : 0877-2260513

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మే 16-31, 2018 సంపుటి - 9 సంచిక - 10




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

పౌరసేవల చట్టం కోసం పార్టీలు ................ 5
ఉక్కుప్రధానిగానా? ఉత్త ప్రధానిగానా? ......... 6
విధానాలే నాయకత్వ ప్రమాణాలు................ 12
కూటమి సర్కార్లు చేటు కలిగిస్తాయనడం ...... 14
కేంద్రప్రభుత్వం ఫెడరల్ ప్రభుత్వంగా మారాలి.... 16
ప్రభుత్వ ఆరోగ్యవిధానం ప్రజల్ని, వైద్యుల్ని......... 18
చట్టసభల్లో కీచకులు.............................. 20
నవ్యాంధ్రకి ద్రోహం చేసింది ఎవరు?.............. 21
రాజకీయాల్ని యువత పట్టించుకోవాలి......... 23
లోక్‌సత్తాలో చేరిన యువత....................... 24
పౌరసేవల చట్టం తేవడానికి సహకరిస్తాం...... 25
ఎన్నారై నిధుల్లో భారత్ అగ్రస్థానం................ 26
ఉపాధిలేని చదువుల ఉపద్రవం ముంచు........ 28
అందరికీ సౌకర్యాలు కావాలంటే పరిశ్రమలు..... 29
చేనేతలు ఆదాయమార్గాల మీద దృష్టి పెట్టాలి... 30
(మీడియాలో) 'కీ' కామెంట్లు !...................... 31
నిరుద్యోగ భృతి, పింఛన్లకు మోసపోవద్దు........ 33

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# కొంతైనా ఆలోచన చేయండి!



“సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలూ ప్రతి రాష్ట్రానికీ వర్తించేవి, జాతీయ స్థాయిలో ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాల్సినవి, ప్రభుత్వాలు సులభంగా, ఉన్న బడ్జెట్‌లోనే, పార్టీలకతీతంగా, ఏమాత్రం ఆలస్యం లేకుండానే అమలుచేయగలిగేవి, జన జీవితాల్లో మాత్రం గణనీయమైన మేలి మార్పును తేగలిగేవి, అమలు చేసే పార్టీలకు కాలక్రమంలో ఓట్లు కూడా తెచ్చేవి. అయితే ఈ లక్ష్యాల్ని నిర్ణయించేటప్పుడు కొందరు యువ సహచరుల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చాయి. వారు ప్రధానంగా సందేహాలు వ్యక్తం చేసిన అంశాలు- చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు నిధులు-విధులు! ఆ లక్ష్యాల గురించి ప్రజలకు పెద్ద అవగాహన, ఆసక్తి ఉండదు, మీడియా పట్టించుకోదు.. వంటి అనుమానాల్ని వ్యక్తం చేశారు. అయితే మహిళల రక్షణకు, పేద, ధనిక తేడా లేకుండా చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపచేసేందుకు చట్టబద్ధపాలనను అమలు చేయటం, ఎక్కడిపనులు అక్కడే జరిగేలా జనం ఉండే గ్రామాలు, పట్టణాలకు నిధులివ్వటం వంటి పునాదులు లేకుంటే ప్రజాస్వామ్యం నిలబడదని హేతుబద్ధంగా వాస్తవాల్ని వివరించి వారిని ఒప్పించాను. నిజాల్ని వివరించి చెబుతుంటే ప్రజలు, ముఖ్యంగా యువత కాస్త ఆలస్యంగానైనా స్పందిస్తారు.. అని ఆంధ్రప్రదేశ్‌లో సురాజ్య యాత్ర పూర్తయ్యేసరికి లోక్‌సత్తా, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) సహచరుల్లో కూడా నమ్మకం కలిగింది. 2జీ స్పెక్ట్రం కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వచ్చాక ‘చట్టబద్ధపాలన’ చుట్టూ ఉద్యమం ఉధృతం చేద్దామని వారే గొంతు పెంచారు” అని కొన్ని నెలల క్రితం ఇదే స్పేస్‌లో చెప్పుకున్నాం. ఇప్పుడు చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల చుట్టూనే ప్రధానంగా రూపొందిన ‘భరత్ అనే నేను’ అనే సినిమా అద్భుత విజయం సాధించటంతో.. ప్రజల మనసుల్లో సురాజ్య ఎజెండా పట్ల ఎంత ఆదరణ ఉందో మరోమారు తేటతెల్లమైంది. మన రోజువారీ జీవితంలో 80 శాతం వరకూ స్థానికంగా ఉండే నిధులు, అధికారాలతోనే ముడిపడి ఉంటుంది తప్ప.. హైదరాబాద్, అమరావతి, ఢిల్లీలతో కాదు! నరేంద్రమోదీ, చంద్రబాబు నాయుడు, కేసీఆర్ ఎంత బలమైన నాయకులైనా మన జీవితాల్ని బాగు చేసే శక్తి వారికుండదు. మనం కట్టే పన్నులు, వాటికి తగ్గట్టు మనం ఉండే చోట మనకు అందుతున్న సేవలు, తేడా వస్తే జవాబు చెప్పే ఏర్పాట్లు.. వీటి గురించి భరత్ అనే నేనులో ఆకట్టుకునేలా చెప్పారు. ఐరోపా ఖండమంత సువిశాలత, భిన్నత్వం, సంక్లిష్టతలు ఉన్న భారతదేశంలో.. స్థానిక స్వయంపాలనా వ్యవస్థలకుండే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఇలాంటి విషయాల్ని కొంతమేరైనా కమర్షియల్‌గా చెప్పాలంటే, ఎంతో లోతైన ఆలోచన, తపన కావాలి. ఈ సాహసాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించి సినిమాని దృశ్యకావ్యంగా మలచిన దర్శకుడు కొరటాల శివ ఎంతగానో అభినందనీయులు. ప్రస్తుతం సురాజ్య ఉద్యమ రూపంలో, అంతకుముందు ఇతరత్రా రూపాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో.. లోక్‌సత్తా లక్ష్యాలు, భావజాలం, రాజకీయ సంస్కృతి పట్ల ప్రజల్లో పెద్దఎత్తున ఆదరణ ఉందని రుజువైంది. భరత్ అనే నేను సూపర్‌హిట్ దాన్నే ప్రతిధ్వనింప చేసింది. మరే దేశానికీ లేనంత అతి పెద్ద స్కేల్ ఆఫ్ ఛేంజ్ అవసరమున్న భారత్‌కు ఏం కావాలో, ఏ విధానాలను ఏ రీతిలో అమలు చేస్తే సమున్నత స్థాయికి చేరుతుందో స్పష్టమైన, సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ని అందుబాటులోకి తేవటం, వాటిని రాజకీయ, పాలనా రంగాలు, ప్రజానీకంలోకి ఏళ్ల తరబడి అలుపెరగని ప్రచారంతో వెదజల్లడం లోక్‌సత్తా ఇప్పటికే సాధించిన పెద్ద విజయం. ఇలాంటి మార్గదర్శనంలేక విఫలమైన ఆందోళనలు, పోరాటాలు (ఫ్రెంచి విప్లవం సహా) ప్రపంచ చరిత్రలో కోకొల్లలు. తన పోరాటంలో భాగంగా.. పెద్దపార్టీలు కూడా సాధించలేనిరీతిలో మూడు కీలక రాజ్యాంగ సవరణల్ని, ఆరేడు చట్టాల్ని, పలు రంగాల్లో విధానమార్పుల్ని కూడా లోక్‌సత్తా సాధించింది. కానీ అత్యాధునిక సాంకేతిక యుగంలోకూడా, ప్రజలు తమ మనసులో ఉన్న ఆకాంక్షల్ని ఆచరణలో చూపటానికి, భాగస్వాములు కావటానికి ఇంకా చాలా అవసరమని అనుభవాలు చెబుతున్నాయి. మార్పు రావాలంటే.. ప్రజల్లో కొంత ఆలోచన కూడా పెరగాలి. భరత్ అనే నేనులో సినిమాపరంగా ఉన్న నాటకీయతను ఆస్వాదిస్తూనే.. అందులో చెప్పిన అంశాల పట్ల కొంతైనా ఆలోచన చేయండని ప్రజలను, ముఖ్యంగా యువతను కోరుతున్నాను. ఓటు వేయటం, ఆ తర్వాత అరవటం.. అనే స్థాయిలోనే కొట్టుమిట్టాడుతున్న మన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచుకోవటానికి పూర్తి ప్రయత్నం చేయండి. సినిమాల ద్వారా సమాజాన్ని ఉద్ధరించండి- అని నిర్మాతలకి, దర్శకులకి మనం చెప్పలేం. కానీ చెప్పాల్సిన విషయాల్ని అమ్ముడయ్యేలా పౌరసత్వాన్ని గూర్చి, ప్రజాస్వామ్యాన్ని గూర్చి అవగాహన పెంచే ప్రయత్నం మాత్రం నిరంతరం కొనసాగుతుండాల్సుంది! ప్రజల్లో అమ్ముడయ్యే విషయాల్ని కాకుండా.. ప్రజలకు అవసరమైన మంచి విషయాల్ని అమ్ముడయ్యేలా చేసే నిపుణులు సినిమాలు, పత్రికలు, టీవీలు, వెబ్, సోషల్ మీడియాల్లో పెరగకపోతే మార్పు చాలా ఆలస్యమవుతుంది, నిత్యం కోట్ల మంది నలిగిపోతుంటారు. ఒకపక్క భరత్ అనే నేను లాంటి సినిమాలు, ఇతరత్రా మాస్ ప్రచారాల ద్వారా సరైన ఎజెండాను విస్తృతంగా, నిలకడగా ప్రజల్లోకి తీసుకెళ్తుంటే, మరోపక్క సమాజంలో కాస్త వనరులు, సమయం ఇచ్చే సమర్థులు ఎక్కడికక్కడ ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటుంటే.. కచ్చితంగా మనం ఊహిస్తున్నదాని కంటే త్వరగానే తెలుగు రాష్ట్రాల్లో, మనదేశంలో మెరుగైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సినిమాలో మహేష్‌బాబు హీరోగా చక్కటి అభినయం కనబరిచారు. ఆయన టక్ చూస్తే నాకో విషయం గుర్తుకొస్తోంది. లోక్‌సత్తా పార్టీ పెట్టిన కొత్తలో.. టక్ చేసుకునే నా ఆహార్యం మీద అనేకమంది అభ్యంతరం చెప్పేవారు. పత్రికల్లో కూడా నా డ్రెస్ మీద వ్యంగ్య కథనాలు వచ్చాయి. ఇప్పుడు ముఖ్యమంత్రి టక్ చేస్తే ఓ గొప్ప అట్రాక్షన్‌గా చూస్తున్నారు. సురాజ్య ఎజెండా అంశాల్ని ఆకర్షణీయంగా చెప్పిన శివకు, తాము కోరుకుంటున్నది ఇదేనంటూ ఆదరించిన ప్రేక్షకులకూ ధన్యవాదాలు చెబుతూ.. ఈ సినిమాలోని అంశాలపై కొంత మేరయినా ఆలోచన చేస్తూ వ్యవస్థీకృత మార్పులో భాగస్వాములు కావాలని మరోమారు విజ్ఞప్తి చేస్తున్నాను.

# పౌర సేవల చట్టం కోసం పార్టీలు ఏకమవ్వాలి




ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా పనుల్ని చేసి పెట్టే 'పౌర సేవల' చట్టాన్ని సాధించుకునేందుకు అన్ని పార్టీలూ కలసికట్టుగా కృషి చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ప్రజలకు సకాలంలో పని చేయకపోతే, రోజుకు ఇంతని డబ్బు రూపంలో పరిహారం చెల్లించాలన్నారు. తెలంగాణలో హక్కుగా పౌర సేవల చట్టాన్ని తీసుకొస్తానని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఫిబ్రవరి 2016లోనే హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సానుకూలతతో లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అక్టోబర్ 19, 2016న ప్రభుత్వానికి పంపామన్నారు.

హక్కుగా పౌర సేవల చట్టంపై హైదరాబాద్‌లో లోక్‌సత్తా తెలంగాణ విభాగం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అధ్యక్షత వహించారు.

విచ్చలవిడిగా సాగుతున్న డబ్బు రాజకీయాలు, డబ్బు ఎన్నికల్లో 'ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి' ప్రధాన పాత్ర పోషిస్తోందని జేపీ అన్నారు. ప్రజలకు హక్కుగా అందాల్సిన రోజువారీ సేవల్ని అధికారులు సరిగా అందించకపోవటాన్ని ఆసరాగా చేసుకుని, రాజకీయ నాయకులు ఓటు బేరాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నేరుగా పనులు చేయించుకోవటం కన్నా.. ఓటును చూపి రాజకీయ నాయకుల మధ్యవర్తిత్వం ద్వారా పనులు చేయించుకోవటం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉపశమనం పొందుతున్నారన్నారు. 49 దేశాల్లో భారతదేశం అన్ని మౌలిక రంగాల్లో అట్టడుగు స్థానాల్లో ఉందని లోక్‌సత్తా అధ్యయనంలో తేలిందని, అందుకు ఈ విషవలయమే ముఖ్య కారణమన్నారు. కేసీఆర్ చేసే యజ్ఞాలు యాగాల ద్వారా దాన్ని ఛేదించటం సాధ్యం కాదని, పౌర సేవల హక్కు చట్టం వంటి వాటి ద్వారానే ఈ మార్పు సాధ్యమని అన్నారు. పౌర సేవల చట్టం సర్వరోగ నివారిణి కాదని, కానీ నిస్సందేహంగా ప్రజాస్వామ్య పరిణామ క్రమంలో సహ చట్టం కంటే శక్తిమంతమైన ఓ మైలురాయి అవుతుందని అన్నారు. 1992 ప్రాంతంలో బ్రిటన్‌లో అప్పటి ప్రధాని జాన్ మేజర్ ఈ చట్టాన్ని అమలు చేశారని, 90 శాతం నాణ్యత ఉన్న పౌర సేవలని 95 శాతానికి పెంచాలని ఆయన ఆశించారన్నారు. మన ప్రభుత్వ కార్యాలయాల్లో 20 శాతం స్థాయి ఉన్న సేవల్ని 60-70 శాతానికి పెంచటానికి ఈ చట్టాన్ని భారత్‌లో తేవాలని లోక్‌సత్తా 1998 నుంచి ప్రయత్నిస్తోందన్నారు. జాతీయ స్థాయిలో లోక్‌సత్తా 2011లో రూపొందించిన ముసాయిదా బిల్లు ఇప్పటికీ పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉందన్నారు. ప్రజలకంటే, ప్రభుత్వోద్యోగులను చూసి ప్రభుత్వాలు వణికిపోతుండటమే ఇందుకు కారణమన్నారు. ఉద్యోగుల చేత సరిగా పనిచేయిస్తే గంపగుత్తగా ఓట్లు పోతాయేమోనని భయపడుతున్నారన్నారు. అందుకే గతి లేక ఓ సర్టిఫికెట్ కోసం లంచం ఇచ్చే సాధారణ ప్రజలకు జైలు, లంచం తీసుకున్న అధికారి మీద మాత్రం అభియోగం నమోదు చేయాలన్నా పైస్థాయిలో అనుమతి కావాలనే దుర్మార్గపు సవరణను అవినీతి నిరోధక చట్టానికి (17 'ఎ' ) కేంద్రం తీసుకొస్తోందన్నారు. ఇందుకు మోదీ ప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలూ ఆమోదం తెలిపాయన్నారు. అవినీతిపై పోరాటంలో ప్రజల రోజువారీ జీవితాల్లో లంచాలు లేకుండా చేయడం ముఖ్యమని, కానీ 17 'ఎ' వల్ల అవినీతిపరులకు రక్షణ పెరుగుతుందని తాను ఎంపీలకు, పార్టీలకూ లేఖలు రాసినా, పార్లమెంటరీ కమిటీ ముందు వాదించినా ఫలితం లేకపోయిందన్నారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే ప్రకారం మనదేశంలో దాదాపు 45 శాతం కుటుంబాలు ఏదోక సమయంలో లంచం ఇచ్చారని, ఇన్ని కోట్ల మందిని జైళ్లలో పెట్టటం ఎలా సాధ్యమన్న ఇంగితం కూడా రాజకీయ వ్యవస్థలో కరువైందని అన్నారు. ప్రజల్లో అవగాహనే రాజకీయాలు, పాలనను గాడిలో పెట్టడానికి కీలకమని, అందుకే పౌర సేవల చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుతూ సాధించేందుకు కృషి చేద్దామని జేపీ అన్నారు.

తెదేపా రాష్ట్ర కమిటీ సభ్యుడు బీఎన్‌రెడ్డి, సీపీఐ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటస్వామి, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబు, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త రేఖ, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ ఎన్‌వీ సుధా కిరణ్, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్నారం నాగరాజు, బీఎల్ఎఫ్ నాయకుడు జాన్‌సాబ్.. లోక్‌సత్తా ప్రతిపాదించిన పౌర సేవల చట్టానికి మద్దతు తెలిపారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ధర్మారావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, రాష్ట్ర నేతలు సరోజాదేవి, దుర్గారావు, గంగాధరరావు, గంగాభవానీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు. ✦

# ఉక్కు ప్రధానిగానా? ఉత్త ప్రధానిగానా?



న్యూస్ పోర్టల్‌లో పనిచేసే ఓ మిత్రుడితో ఈ మధ్య మాట్లాడే అవకాశం వచ్చింది. ఆయన కూడా లోక్‌సత్తా భావజాలంతో వికసించిన వ్యక్తి కాబట్టి.. చర్చ ఎక్కువ సామాజిక, ఎన్నికల రాజకీయాల గురించే జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని ఇద్దరు చంద్రులు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఉపగ్రహాలుగా మార్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిస్థితి ఏమిటి? ఎన్నికలు ఎప్పుడైనా జరిగే పరిస్థితి ఉంది గదా.. కొత్తమిత్రులు, రహస్య మిత్రులతో బీజేపీ ఎలాంటి వ్యూహాలు వేయబోతోంది? వంటి ప్రశ్నల్ని కూడా మాట్లాడుకున్నాం. ఈ సందర్భంగా ఆయన యథాలాపంగా ఓ విషయం చెప్పారు.

ఆయన బావమరిది పక్కా బీజేపీ, మోదీ ఫేవరేట్ అట. బీజేపీని, మోదీని విమర్శిస్తూ ఏం మాట్లాడినా ఊరుకునేవారు కారట. మోదీకి వ్యతిరేకంగా విశ్లేషణల్ని చేసినా, వార్తల్ని రాసినా వాటిపై బావతో వాగ్వాదానికి దిగిన సందర్భాలు అనేకం. అలాంటి వ్యక్తి ఇటీవల మోదీపై తీవ్ర విముఖత వ్యక్తం చేస్తున్నారట. తన బావమరిదిలో వచ్చిన ఈ మార్పు పట్ల మిత్రుడు కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

"మోదీ అంతా నాశనం చేసేశాడు బావా. అద్వానీ, వాజ్‌పేయిల నాటి బీజేపీ కాదిది".

"అదేంటి బావా! రాజకీయ పార్టీలున్నదే అధికారంలోకి రావడానికి, ఎలాగోలా ఎన్నికల్లో గెలిచిన పార్టీయే గొప్ప, మా పార్టీని అధికారంలోకి తీసుకురావాలి.. అని కార్యకర్తలు, నాయకులు అనుకుంటుంటారు గదా! 20కి పైగా రాష్ట్రాల్లో అధికారాన్ని సాధించి బీజేపీని తేరిపార చూడటానికి కూడా భయపడేట్టు చేస్తున్న మోదీ గురించి అలా అంటావేంటి? ఒక్కసారిగా సీన్ మారిపోయింది, ఏమైంది నీకు?"

సమాధానం చెప్పడం ఇష్టంలేనట్టు మిత్రుడి బావమరిది అనాసక్తంగా విషయాన్ని దాటవేశారట.

......................

ఈ సంఘటన తర్వాత 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సి.నరసింహారావు మోదీపై ఒక సీరియల్ విశ్లేషణను ప్రారంభించారు. మూడ్రోజులు ప్రచురించగానే, దానిపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతి కార్యాలయం ముందు ధర్నాలు చేశారు. ఆ తర్వాత ఆ విశ్లేషణ ప్రచురణ ఆగిపోయింది. నరసింహారావు కాలమ్ ఇంకా ఉందా, ఉంటే ఎంతకాలం ప్రచురితమై ఉండేది? కావాలనే పత్రికవారు ఆపేశారా?.. వివరాలు మనకు తెలియదు. గత ఎన్నికల సమయం (2014)లో కూడా నరసింహారావు అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీపై ఇలాగే సీరియల్ విశ్లేషణ రాశారు. ఆరోజున కూడా చాలామంది చదివారు గానీ, ఇలా ధర్నాలు, దాడుల బెదిరింపులు లేవు. అప్పుడు యూపీయే ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఆరోజున తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మోదీ వేవ్ బలపడటానికి ఈ సీరియల్ కాలమ్ కూడా కొంత దోహదం చేసి ఉండొచ్చు.

బీజేపీవారికి అభ్యంతరాలుంటే.. "ఓ వ్యక్తిత్వ వికాస నిపుణుడా! ఆరోజున ఏకపక్షంగా సోనియా గాంధీని మాత్రమే విశ్లేషించి కాంగ్రెస్‌ను దెబ్బతీశారు. ఇప్పుడు బీజేపీయేతర శక్తులు బలపడేలా మోదీ గురించి రాస్తున్నారు. ప్రజలకు

వాస్తవాల్ని చెప్పి మెరుగైన నేతలు, పార్టీల్ని ఎన్నుకునేలా చేయటమే మీ లక్ష్యమైతే.. సోనియా, మోదీ, ఇతర నేతలని పోల్చి చూపుతూ రాయాలి. కానీ మీ రాతల్లో పక్షపాత ధోరణులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మీ వ్యక్తిత్వంలో పక్షపాతం స్థానంలో వికాసం కావాలి" అంటూ ఎలివేటెడ్ వాదనను వినిపించి ఉండొచ్చు. లేదా "నరసింహారావు గారూ! మోదీ వ్యక్తిత్వంపై మీరు చేసిన ఫలానా విశ్లేషణ సరిగా లేదు. వాస్తవాలు ఇవిగో" అంటూ.. కౌంటర్ కాలమ్ నడిపినా, వ్యాసాల ద్వారా విమర్శనాస్త్రాలు సంధించినా బాగుండేది. తెలుగులో 'వ్యక్తిత్వ వికాసం' అన్న పదాన్ని సృష్టించి, ఆ విభాగంలో కోటి రూపాయల బిజినెస్‌ను ఒకే పుస్తకం ద్వారా చేసిన తొలి తెలుగు రచయితగా నరసింహారావు కూడా ఇంకొంత కొత్తగా ఆలోచించి తన మేధకు పదును పెట్టి ఉండేవారు. తెలుగు ప్రజలకు ఒక గొప్ప నిర్మాణాత్మక బహిరంగ చర్చ విందు లభించి ఉండేది. కానీ అందుకు అవకాశం ఇవ్వకుండా పాతకాలపు అణగదొక్కే పద్ధతుల్లో బీజేపీ వారు వ్యవహరించారు. బీజేపీ వాదనల్ని ఆంధ్రజ్యోతి పత్రిక ప్రచురించనందా అంటే.. అటువంటిదేమీ లేదు!

.....................

"జన్‌లోక్‌పాల్ విషయంలో అన్నా హజారే వ్యవహరించినట్టే పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవహరించారు.

అన్నా హజారే కంటే మోదీకి పార్టీ రాజకీయ అవసరాలు ఉన్నా, సదుద్దేశంతోనే నోట్ల రద్దు చేశారని నమ్మవచ్చు.

అయితే, నోట్ల రద్దు నిర్ణయం అనాలోచితంగా జరిగిందని, చాలా విషయాలపై ప్రభుత్వంలో ఉన్నవారికి అవగాహన కూడా లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఆలోచించటం రాజకీయాలలో ఒక అనర్హత, ఫ్యాషన్‌గా మార్చేసుకోవటం వల్ల జరిగిన అనర్థం ఇది. విజ్ఞులు, మేధావులు రాజకీయాలలోకి రాకూడదు అని మనం తీర్మానించుకోవటం వల్లే ఉన్నట్టుండి ఇంత సంక్షోభం తలెత్తింది. ఇలాంటి అనర్థాలు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అనేక రంగాలలో నిత్యం జరుగుతున్నా, ఈ స్థాయిలో మన కళ్లు తెరుచుకునేలా చేసింది మాత్రం డీమానిటైజేషన్ హఠాత్ పరిణామమే. మనదేశాన్ని నియంతలు పాలించాలి అని భ్రమపడేవారి కళ్లను కూడా తెరిపించిందీ పరిణామం.

అధ్యయనం చేయటం, తగినవారి నుంచి సలహాసూచనలు తీసుకోవటం, ఆ తర్వాత ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటం అనే సంస్కృతి రాజకీయాలలో పెరగాలి. సరైన ఆలోచన, ముందుచూపు లేకుండా ఉద్వేగాలు, సానుభూతులు, సహానుభూతులకే పరిమితమయ్యే రాజకీయ నాయకులు ఎంత గొప్పగా అనిపించినా వారిని పక్కనపెట్టటమే మేలు.

మీ ప్రధానమంత్రి మంచి చేయాలనే తపనకలవాడు, మాటకారి, ధైర్యవంతుడేగానీ.. తెలివిలేనివాడు అంటే మనకి ఎంత అప్రతిష్ఠ!" అని లోక్‌సత్తా టైమ్స్ జనవరి 16, 2017 సంచిక కవర్‌పేజీ కథనంలో పేర్కొన్నాం.

అంతకుముందు కూడా మోదీ పాలనపై చేసిన సమీక్షల్లో ప్రధానమంత్రికి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ఇచ్చిన వివిధ సూచనల్ని క్రమం తప్పకుండా ఇస్తూ, కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చేసుకోవాల్సిన అవసరాన్ని లోక్‌సత్తా టైమ్స్‌లో చెబుతూ వచ్చాం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కంటే ఎక్కువగా మోదీ గురించి టైమ్స్‌లో ప్రచురించటానికి ప్రధాన కారణం– భారతదేశంలో సమూల మార్పుల్ని తెచ్చే అరుదైన అవకాశం ఆయన చేతుల్లో ఉండటం! నాలుగేళ్ల పాలన తర్వాత.. మోదీ నిజాయతీపరుడేగానీ, తెలివితక్కువ పాలకుడు అని దశాబ్దాల అనుభవమున్న రాజకీయ విశ్లేషకులు సహా పలువురు ఆలోచనాపరులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు! తనకు తెలియకపోతే ఇతరుల నుంచైనా తెలుసుకోవచ్చుగదా అని తెలుగునాట మోదీకి ఓటు వేసినవారే అసహనం వ్యక్తం చేస్తున్నారు.

.....................

"మనం తప్పులు చేస్తాం. ప్రసార మాధ్యమాలకు మసాలా అందిస్తాం. పెద్ద సామాజిక శాస్త్రవేత్తల్లా, నిపుణుల్లా అన్ని అంశాలనూ విశ్లేషించేస్తాం. కెమేరా కనిపిస్తే చాలు.. ఏదో ఒకటి మాట్లాడేస్తాం. ఆ అరకొర సమాచారమే ఎక్కడికో పోతోంది. వివాదం రేకెత్తాక మనం మీడియాను నిందించకూడదు. మీడియా తన పని తాను చేస్తోంది. మనం మాట్లాడితేనే అవి ప్రచారంలోకి తెస్తాయి. మన మాటల నుంచి ఉపయోగపడతాయనుకున్న వాటిని మీడియా తీసుకుంటుంది. టీవీ కెమేరా ముందు నిల్చుని ప్రతి అంశంపైనా జాతికి దిశానిర్దేశం చేయాలనుకోవడం తగదు. సంయమనం పాటించాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఆయా అంశాలపై మాట్లాడాల్సినవారు ఎలాగూ మాట్లాడతారు" అని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యక్ష ప్రసార విధానంలో జరిపిన సదస్సులో మోదీ హితవు పలికారు.

.....................

.. పైన పేర్కొన్నవి నాలుగు సాధారణ పరిశీలనలు, ప్రస్తావనలు! అన్నం ఉడికిందా లేదా అని తెలియజెప్పే మెతుకుల్లా ఇవి మోదీ నాలుగేళ్ల పాలన తీరును పట్టిస్తాయి.

మొదటి అంశం నుంచి చూస్తే.. సొంత భారతీయ జనతా పార్టీ సిన్సియర్ కార్యకర్తలు, నేతలు ఆశించినది సాధించటంలో కూడా మోదీ విఫలమయ్యారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు, వాటన్నిటినీ నెరవేర్చడం సాధ్యమా? అనుకోవడానికి కూడా ఇక్కడ ఆస్కారం లేదు. మోదీ పార్టీ ఎన్నికల్లో వరుసగా గెలుస్తూ పార్టీ వర్గాలు ఊహించినదానికన్నా ఎక్కువ విజయాల్నే సాధించింది. అయితే ఈ క్రమంలో బీజేపీ కూడా కాంగ్రెస్‌కు నకలుగా మారిపోయిందన్న విషయాన్ని గుర్తించటానికి మోదీ నిరాకరిస్తున్నారు. పైస్థాయిలో వంశపారంపర్య రాజకీయాలు లేకపోవటం, వ్యక్తిగత నిజాయతీ కాస్త ఎక్కువ వంటి అంశాలను మినహాయిస్తే.. ఈవేళ కాంగ్రెస్‌కు-బీజేపీకి మధ్య తేడా ఏమీ లేదు. అందుకే బీజేపీ పట్ల ఎన్నో ఆశలతో ఏమీ ఆశించకుండా పనిచేస్తున్న పలువురు కార్యకర్తల్లో నిరాశ, నిర్లిప్తత నెలకొంది. గత సమావేశాల్లో పార్లమెంటును తెదేపా, ఇతర కొన్ని ప్రతిపక్షాలు నడవనీయలేదంటూ మోదీ అసాధారణరీతిలో నిరాహారదీక్ష చేసినా పార్టీలో పెద్ద ఉత్సాహం కనిపించలేదు.

రెండో అంశం, భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయటం, హేతుబద్ధ ఆలోచనా తీరుని, వాదనల్ని చిన్నచూపు చూడటానికి సంబంధించినది! పాలనలో ఉన్న లోపాల గురించి మోదీ అండ్ కో తెలుసుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదుగానీ.. తనను విమర్శించిన, తన పార్టీని దెబ్బతీసేలా వ్యవహరించిన వారి వివరాలను మాత్రం దేశం నలుమూలల్నుంచీ మోదీ బృందం వేగంగా తెలుసుకుంటోంది. దేశం మొత్తం మోదీత్వ బీజేపీని విస్తరించే క్రమంలో ఎక్కడికక్కడ శరవేగంగా సమాచారాన్ని అందించే వ్యవస్థ ఏర్పాటైంది. ఇందుకోసం ప్రాచుర్య మీడియాను కూడా చాలా ప్రాంతాల్లో ల్యావ్‌డాగ్‌గా మార్చేసుకున్నారు. దేశ ప్రధానమంత్రిలా కాకుండా.. ఓ పార్టీ ప్రతినిధిగా వ్యవహరించటానికి ప్రాధాన్యమిచ్చే ఈ ధోరణి వల్లే మోదీ ఆహారపు అలవాట్ల మీద దాడులు, గోరక్షక్ దళాలు, మరికొందరు చేసిన అమానుషాల మీద వెంటనే స్పందించలేదు. అయినదానికి కానిదానికి ట్విట్టర్‌లో స్పందించే మోదీ.. కథువాలో 8 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ అత్యాచారం పట్ల దేశమంతా ఆగ్రహావేశాలు పెల్లుబికినాకే స్పందించారు. అది కూడా చట్టబద్ధపాలన వైఫల్యం గురించి ప్రస్తావించకుండా .. ఖండనలు, రాజకీయ నిందలు, మగపిల్లలకు బుద్ధులు చెప్పటం వంటి అంశాలకే పరిమితమయ్యారు. ఏ ప్రభుత్వ హయాంలోనైనా ఇలాంటి జరుగుతుంటాయన్నారే తప్ప, ఇలాంటివి జరగకుండా చట్టబద్ధపాలన వంటి ఏర్పాట్లు చేయటానికే తనను ఎన్నుకున్నారన్న విషయాన్ని దాటవేశారు. ప్రభుత్వంలో లేని లోక్‌సత్తా లాంటి సంస్థలు సరైన పరిష్కారాలతో ప్రజలకు దిశానిర్దేశం చేయగలిగితే అదే గొప్ప. కానీ అధికారంలో ఉన్న మోదీ కూడా అపరిచితుడిలాగా ప్రభుత్వంలోని వారి మీద, స్వపక్షంలోని వారి మీద విమర్శలు, నీతివాక్యాలు చెప్పటమేంటి? అధికారంలో ఎవరో ఉన్నారు, నేను బయట ప్రజల పక్షాన ఉన్నాను అని ఆయన తప్పించుకోవటం.. నాలుగేళ్ల తర్వాత ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు, సాధ్యం కూడా కాదు.

మూడోది, తెలివిలేని నిర్ణయాలు! భారతదేశంలో 30-40 ఏళ్ల తర్వాత ఓ గొప్ప అవకాశం మోదీకి వచ్చింది. అది కూడా.. ఏ నాయకుడి వారసుడిగానో, అవినీతితో ఆస్తులు సంపాదించుకునో కాకుండా పెద్దఎత్తున ప్రజల అభిమానాన్ని, ఓట్లను సంపాదించుకుని మోదీ అధికారంలోకి వచ్చారు. కానీ ఆ సువర్ణావకాశాన్ని మోదీ వినియోగించుకోలేకపోయారు. దేశ జనాభాలో అత్యధికులు యువత కావడం, టెక్నాలజీ కనీవినీ ఎరుగనిరీతిలో విస్తరిస్తుండటం, ప్రపంచీకరణ పరిణామాలు.. ఇలాంటి కీలక తరుణంలో దేశాన్ని సరైన కక్ష్యలోకి ప్రవేశపెట్టే మహదవకాశాన్ని మోదీ అర్థం చేసుకోలేకపోయారు. తనకున్న ధైర్యాన్ని, కష్టపడేతత్వాన్ని, తనకొచ్చిన ప్రజాతీర్పుని దేశం కోసం కాకుండా తన పార్టీని తన గుప్పెట్లో ఉంచుకుని విస్తరించుకోవడానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఇందుకోసం గుజరాత్‌లోలా కొద్దిమంది ఉన్నతాధికారుల ఆలోచనలకే పరిమితమయ్యారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)నే తీసుకుంటే.. అవినీతిని అంతం చేయటానికే మోదీ సాహసోపేతంగా నోట్ల రద్దును చేశారని కోట్లాది మంది సామాన్య, మధ్యతరగతి వారు భావించారు. అందుకే కష్టనష్టాలను ఓర్చారు. అయితే వెయ్యి, రెండు వేలకు తాము బ్యాంకుల వద్ద గంటల తరబడి బారులు తీరి బాధలు పడితే.. బ్యాంకుల నుంచి లక్షల కోట్లు కొల్లగొట్టి దేశం విడిచిపోతున్నా మోదీ సర్కారు చూస్తూ ఉండిపోయిందని వారు దిగ్భ్రమ చెందారు. నోట్ల రద్దు చేసి 18 నెలలైనా ఏటీఎంలలో, బ్యాంకు శాఖల్లో నగదు దొరక్క పోవటం వారిని తీవ్ర వేదనకు గురిచేసింది. నోట్ల రద్దు చేయటానికి ముందు కొత్త నోట్లను సిద్ధంగా ఉంచకపోవటం, అవినీతి అంతానికి ఇతర చర్యలను తీసుకోకపోవటం వల్ల కాస్తో కూస్తో అవగాహన ఉన్నవారిలో మోదీ పట్ల భ్రమలు తొలగిపోనారంభించాయి.

ఇదే తరహాలో ఎన్నికల సమయంలో బీజేపీ కీలకహామీ అయిన ఉద్యోగాల కల్పనలో కూడా మోదీ ఘోరంగా

విఫలమయ్యారు. ఏడాదికి 1 కోటి ఉద్యోగాలను సృష్టిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 2014–2017 మధ్య ఐటీ, రిటైల్, టెక్స్టైల్, ఆటోమొబైల్ రంగాల్లో 1.4 కోట్ల ఉద్యోగాలు వచ్చాయని మోదీ బృందం చెబుతున్నా, వాస్తవాలు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. పర్యాటకరంగం ఏడాదికి 16 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని, 30–40 లక్షల ఉద్యోగాలు వచ్చాయని మంత్రులు చెబుతున్నారు కానీ.. క్షేత్రస్థాయి లెక్కలు అందుకు అనుగుణంగా లేవు. పర్యాటకుల సంఖ్య 16 శాతం చొప్పున పెరుగుతున్నా, ఒక పరిశ్రమగా పర్యాటకరంగం వృద్ధి 7 శాతమేనని, వచ్చిన ఉద్యోగాలు 5 లక్షలకు మించవని విశ్లేషకులు అంటున్నారు. అలాగే ప్రావిడెంట్ ఫండ్ రిజిస్ట్రేషన్లలో పెరుగుదలను చూపిస్తూ 2017–18లో సంఘటిత రంగంలో 70 లక్షల ఉద్యోగాలు వచ్చాయని, గత ఆరు నెలల్లోనే 35 లక్షల ఉద్యోగాలు వచ్చాయని చేస్తున్న వాదననూ వారు తప్పుపడుతున్నారు. నగదు స్థానంలో డిజిటల్ లావాదేవీలు రావడం, ఇతర తాత్కాలిక సర్దుబాట్ల వల్ల పీఏఫ్ నమోదులు పెరిగాయంటున్నారు. మొత్తమ్మీద ఉపాధి కల్పనకు సంబంధించి కచ్చితమైన సమాచారం, సాధికార విశ్లేషణలు ఇంకా అందుబాటులో లేకపోయినా, మోదీ గత నాలుగేళ్ల హయాంలో ఉపాధి అవకాశాలు కొన్ని రంగాల్లో దెబ్బతిన్నాయని, మొత్తంగా ఆశించినంత లేవని మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితులు వెల్లడిస్తున్నాయి. పకోడీలు అమ్ముకోవడాన్ని, ఉపాధి హామీ పథకంలో గుంతలు తవ్వడం, పూడ్చడాల్ని కూడా ఉద్యోగాలుగా లెక్కేస్తే.. అంతకంటే యువతను మోసం చేయడముండదు. దేశంలో అందరికీ ఉపాధి అవకాశాలను కల్పించటం అసాధ్యమని మోదీ భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రభుత్వమే అందరికీ ఉద్యోగాలనివ్వటం సాధ్యం కాదు కాబట్టి.. నిరుద్యోగ భృతి తరహాలో సార్వత్రిక ఆదాయ పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్టుంది. ఉద్యోగాలివ్వటం ప్రభుత్వం పనికాకపోయినా, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించే పాలనను అందించటం తన ప్రభుత్వ బాధ్యత అని మోదీ విస్మరిస్తున్నారు. దేశంలో అత్యధిక జనాభా ఆధారపడిన వ్యవసాయరంగాన్ని బాగు చేయటం, గ్రామాల చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధిని పట్టాలెక్కించే ప్రయత్నం సక్రమంగా లేదు. 'మేకిన్ ఇండియా' ఎందుకు విఫలమైందో ఆయన సమీక్షించుకోలేదు.

ఇక సుస్థిర ఉపాధికి, వివక్ష లేకుండా ఎదుగుదలకు, దేశ ఉజ్వల భవితకు కీలకమైన.. విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించి అత్యంత పేలవమైన రికార్డును మోదీ ఈ నాలుగేళ్లలో నమోదు చేశారు. తాజాగా వచ్చిన 'అసర్' సర్వేతోపాటు జాతీయ అఛీవ్‌మెంట్ సర్వే వంటివి కూడా మన పాఠశాల విద్యాప్రమాణాలు ఎంతో అధ్వాన్నంగానే కొనసాగుతున్నాయని తేల్చిచెప్పాయి. పెద్దగా ప్రమాణాలు లేకున్నా ప్రైవేటు స్కూళ్లలోనే విద్యార్థులు పెరుగుతున్నా, విద్యాహక్కు చట్టంలోని లోపాల్ని సరిదిద్దేందుకు, నూతన విద్యావిధానాన్ని నిర్మించేందుకు మోదీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. కేవలం భయం లేకుండా పరీక్షలు రాయడం మీద ఓ పుస్తకాన్ని విడుదల చేసి, మన్ కీ బాత్ అంటూ మాట్లాడి పాప్యులారిటీ పొందడానికి మోదీ పరిమితమయ్యారు. ఆరోగ్య రంగంపై కొంత మేలుకొని ఓ పెద్ద ప్రయత్నానికి శ్రీకారం చుట్టినా.. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మూలమైన ప్రాథమిక చికిత్స పట్ల, వైద్యులను అందుబాటులో ఉంచటం పట్ల స్పష్టత లేకుండా ఆరోగ్యశ్రీ తరహాలో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు లాభం చేకూర్చేలాగానే బీమా ఆధారిత పథకానికి రూపకల్పన చేస్తున్నారు. విద్య, ఆరోగ్యం సహా సామాజిక రంగంలో కేటాయింపుల్ని తగ్గించేశారు.

నాలుగోది, బీజేపీ లేదా వారి వెనకనున్నవారి భావజాలం పరిమితమైందని మోదీయే స్వయంగా తమ పార్టీ నేతల సమావేశంలో అంగీకరించడం! అన్నీ తెలిసినట్టు ఏది బడితే అది మీడియా ముందు వాగొద్దని తన పార్టీ ప్రజాప్రతినిధుల్ని మోదీయే హెచ్చరించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన ఎప్పుడో గుర్తించి, అత్యుత్తమ ఆలోచనల్ని ఆహ్వానించి ఉంటే ఈ దేశానికి కొంతైనా మేలు జరిగి ఉండేది. మహాభారత కాలంలోనే టెస్ట్ ట్యూబ్ బేబీ టెక్నాలజీ ఉందని కర్ణుడి పుట్టుక గురించి చెబుతూ సాక్షాత్తూ ప్రధానే వ్యాఖ్యానిస్తే.. ఇక మిగిలిన నేతల అజ్ఞానం కట్టలు తెంచుకోకుండా ఉంటుందా?

హింసాత్మక దాడులు కావచ్చు, ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్ట సవరణ కావచ్చు, రిజర్వేషన్లు కావచ్చు, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, తెలుగు రాష్ట్రాలకు విభజన హామీల అమలు కావచ్చు, పార్లమెంటు నిర్వహణ కావచ్చు.. మోదీ ప్రభుత్వం సకాలంలో స్పందించి సరైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. మోదీకి 2014లో గణనీయంగా మద్దతు పలికిన దళితులకు బీజేపీ ఏం చేసింది? అని ఆ పార్టీ ఎంపీలే నిలదీసే పరిస్థితి వచ్చింది. ఓడి గెలిచినవారి నుంచి నేర్చుకునే పాఠాలుంటాయి. కానీ గెలిచినా ఓడినవారి కంటే తక్కువగా అనిపించే వారి నుంచి నేర్చుకోవడానికి ఏముంటాయి?

ప్రజలను నమ్మకపోవడం, సరైన అధ్యయనం లేకపోవడం, ప్రశ్నించే అవకాశాన్ని ఎదుటివారికి ఇవ్వకపోవడం వల్ల.. ఆయన వ్యక్తిగత నిజాయతీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవం ఒక పరిధి దాటి పనిచేయటం లేదు. అన్ని రాష్ట్రాల్లో పార్టీ విజయం సాధిస్తే, దేశాన్ని పూర్తి కంట్రోల్‌లోకి తెచ్చి

## 'పరిణతి' శబ్దం రావటం లేదు!

సాంస్కృతికంగా బహుళ ప్రచారంలో ఉన్న మరో సంఘటనను కూడా ప్రస్తావించుకోవటం ఇక్కడ సందర్భోచితం. మధ్యయుగ భారతదేశంలో భక్తి ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో జరిగిందిది.

మహారాష్ట్రలో ఒక మహాభక్తుడి ఇంటికి కొందరు సాధువులు వచ్చారట. వారందరికీ ఉన్నంతలో ఆ భక్తుడు ఆతిథ్యమిచ్చాడట. సాధువులంతా.. తమ గొప్పలు చెప్పుకుంటూ, దేవుడికి నేనెక్కువ దగ్గరంటే నేనెక్కువ దగ్గర– అని వాదించుకోవటం ప్రారంభించారట. అప్పుడు సదరు మహాభక్తుడు సాధువులందరికీ నమస్కరించి.. తమరంతా అనుమతిస్తే దేవుడికి ఎవరు ఎక్కువ దగ్గరగా ఉన్నారో చెబుతానన్నాడట. అందరూ ఒప్పుకున్నారు. అప్పుడు మహాభక్తుడు.. భోజనం బంతిలో కూర్చున్న ప్రతి సాధువు తల మీద తన చేత్తో సున్నితంగా తడుతూ కలియతిరిగాడు. చివరికి 'మీలో ఎవరూ దేవుడికి దగ్గరగా లేరు' అన్నాడు. 'అదేం పరీక్ష' అంటూ సాధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ తలను చేత్తో తాకితే పుర్రె నుంచి వచ్చే శబ్దంలో మీ పరిణతి తెలుస్తుంది. నేను తాకిన ప్రతి తలలోనూ పుర్రె నుంచి విషయవాసనలు పేరుకుపోయిన శబ్దమే తప్ప స్పష్టమైన, స్వచ్ఛమైన దైవనాదం వినిపించలేదు" అని సదరు భక్తుడు వివరించాడట. దీంతో సాధువులకు జ్ఞానోదయమైంది. అంత గొప్ప ఆతిథ్యమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపి ముందుకు సాగిపోయారు. 'ప్రధాని పదవి నుంచి దిగిపోతే చిన్న సంచిలో తన సామాన్లు సర్దుకుని వెళ్లిపోయే సన్యాసిలాంటి వాడినని, తనకు అవినీతి ఆస్తులు, పోగేసుకున్న సంపదలు ఏమీ లేవని' మోదీ చెప్పారు కాబట్టే ఈ ప్రస్తావన.

మోదీ వ్యక్తిగతంగా నిజాయతీపరుడు, విశిష్ట సాధువు అనటంలో సందేహం లేదు. ఆయనకు ఏదో సంపాదించుకుని వెనకేసుకోవాలన్న కోరిక ఏ కోశానా లేదు. ఆయన చర్యల్లో దురుద్దేశాలు కూడా ఉన్న దాఖలాల్లేవు. ఆయన పార్టీకి దన్నుగా ఉన్న పరివార శక్తులలో పలువురికి కూడా ఇదేరకమైన నిస్వార్థత ఉంది. మిగతా పార్టీల్లో దాదాపు అందరూ డబ్బు, వంశపారంపర్య రాజకీయాలు వంటి వాటి మీద ఆశతో అధికార రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీలో మోదీ సహా చాలామంది తాము నమ్మిన హిందూ విలువల కోసం నిస్వార్థంగా అధికార రాజకీయాలు చేస్తున్నారు. నిజానికి ఈ తేడా వల్లే మిగతా సాంప్రదాయ పార్టీలకంటే బీజేపీకి అదనంగా కొన్ని రెట్లు  శక్తి సమకూరింది. ఎన్నికల రాజకీయాల్లో చాలా పార్టీల్ని వణికించగలుగుతోంది. అయితే నిస్వార్థత నిండిన వీరి సాధుత్వంలో పరిణతి లేకపోవటం ఇప్పుడు దేశానికి సమస్యగా మారింది. కార్యకర్తల్లోని స్ఫూర్తిని నీరుగారుస్తోంది. భక్తి ఉద్యమకాలంలోని ఆ మహాభక్తుడిలా వీరి తలను మీటితే.. అపరిపక్వ శబ్దాలే తప్ప దైవత్వమనదగ్గ పక్వత కనిపించదు. తత్వవేత్త దేశానికి రాజయితేనే మంచి పాలన ఇస్తాడని గ్యారంటీ లేనప్పుడు, అర్థజ్ఞానులు, అపరిపక్వ ఆలోచనాపరులు దేశానికి గొప్ప పాలన ఇస్తారనుకోవడం భ్రమ. మోదీ బృందంతో వస్తున్న సమస్య అదే.

మోదీకి నిజంగా రుషితుల్యమైన పరిణతి ఉండి ఉంటే.. అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే రాజ్యాంగ స్ఫూర్తితో తన పదవికి న్యాయం చేయటానికి ప్రయత్నించేవారు తప్ప తన వ్యక్తిగత నిస్వార్థతను, సన్యాసి జీవితాన్ని పెద్ద అర్హతగా భావించేవారు కారు. పాత కాలం భావాలకు, ఆధునిక ఆలోచనలకు మధ్య వారధిగా రాజ్యాంగం సక్రమంగా పనిచేసేందుకు కావలసిన వ్యవస్థల నిర్మాణాన్ని ధైర్యంగా చేసి ఉండేవారు. ఎన్నికల్లో గెలుపును ఓ మార్గంగానే తప్ప.. అధికారమే లక్ష్యంగా పనిచేసేవారు కారు. మోదీ ఇలా సామర్థ్యంతో పనిచేసిఉంటే.. హిందుత్వానికి వక్రభాష్యం చెప్పేవారు ఎంత చెలరేగినా ప్రజలు కూడా పట్టించుకోవాల్సిన అవసరముండేది కాదు. లెక్కలు, సైన్సు, విశ్లేషణ, తర్కం, సృజనాత్మకత నేర్పే నాణ్యమైన చదువు అందిస్తుంటే.. చరిత్రలో వక్రీకరణలు ఎందుకు చర్చనీయాంశమవుతాయి? సరైన చదువు.. అన్నిటినీ సరిచేస్తుంది. మంచి రాజకీయాల్ని మించిన పవిత్ర వ్యాసంగం, విశిష్ట రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాన్ని పక్షపాతాలు లేకుండా వినియోగించటాన్ని మించిన మహా సేవ ఉండదు.

అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే రాజ్యాంగ స్ఫూర్తికనుగుణంగా స్థితప్రజ్ఞతతో తమ బాధ్యతల్ని నెరవేర్చకుండా.. పక్షపాత రాజకీయాలకనుగుణంగా హఠయోగంతో పనిచేశారు కాబట్టే, మోదీ కావచ్చు, ఆదిత్యానాథ్ కావచ్చు.. సాధారణ యోగులు, పాలకులుగానే మిగిలిపోయారు. ఫెడరల్ స్ఫూర్తితో అధికారాన్ని జనానికి చేరువచేసి స్థానికంగా ఎక్కడికక్కడ పనులు జరిగే ఏర్పాటు చేయకుండా, దేశ విజయాల ద్వారా పార్టీ విజయాల్ని సాధించే ప్రయత్నం చేయకుండా.. పరిమితమయ్యారు. ప్రతిపక్షాల బలహీనతే వారి బలంగా ఉంది తప్ప సొంత బలమంటూ లేదు. వీరి సదుద్దేశాలు జనహితం దిశగా విస్తరిస్తాయని ఆశిద్దాం. కానీ ఇదే తీరు భారత రాజకీయాల్లో కొనసాగితే మాత్రం.. ముమ్ముందు రోబోలు పాలకుల అవతారమెత్తినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

సంస్కరించవచ్చని మోదీ భావిస్తున్నట్టు కనిపిస్తోంది. బీజేపీ గెలుపును ఓ పవిత్ర కార్యంగా భావిస్తూ.. అందుకు విచ్చలవిడిగా డబ్బును వెదజల్లటం, నేతలను, మీడియాను  కొనుగోలు చేయటం లేదా లొంగదీసుకోవటం, ఇతరత్రా ఎన్ని తప్పిదాల్ని చేసినా ఫర్వాలేదనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. అన్నీ తన చుట్టూ కేంద్రీకరించుకుని, అమిత్‌షా లాంటి వారి రోబోటిక్

## నగరాలు, జిల్లాలు, రాష్ట్రాల నుంచి మార్పును సాధిద్దాం.. దేశానికి విస్తరిద్దాం

మోదీ వైఫల్యం కనీసం ఈ నాలుగేళ్లలో దేశాన్ని ప్రేమించేవారిని చాలా నిరాశ పరిచిందనటంలో సందేహం లేదు. కానీ అంతా అయిపోయినట్టు చతికిలపడనక్కర్లేదు. దేశవ్యాప్తంగా మార్పు వచ్చే అవకాశం ప్రస్తుతానికి కనిపించటం లేదుగానీ.. నగరాలు, జిల్లాలు, రాష్ట్రాల స్థాయిలో మనం చాలా చేయవచ్చు. మనం ఉండే చోట నుంచి చుట్టూ మార్పుల్ని తీసుకొస్తుంటే.. క్రమంగా ఇతర ప్రాంతాలూ నేర్చుకుంటాయి, ఆ మార్పులే దేశవ్యాప్తమవుతాయి. కాబట్టి ఉంటున్న ఊరు, జిల్లా, రాష్ట్రం నుంచి మార్పు కోసం ప్రయత్నిద్దాం, ఇతర రాష్ట్రాలకూ, దేశానికీ విస్తరిద్దాం.

సేవలతో తన పార్టీని విస్తరించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. వ్యవస్థల పట్ల విశ్వసనీయత సన్నగిల్లేలా చేస్తున్నారు. కనీసం లోక్‌పాల్ నియామకం చేయలేదు. సమాచార హక్కు చట్టం అమలును నిర్లక్ష్యం చేశారు.

విదేశీ సంబంధాల్లో, ఈశాన్య రాష్ట్రాల పట్లా, ఆర్థిక రంగంలోనూ మోదీ చేసిన మెరుగైన కృషిని కూడా కీలకరంగాల్లో ఆయన పాలనా వైఫల్యం మసకబార్చింది.

ఈ నేపథ్యంలో మోదీ మళ్లీ గెలుస్తారో లేదోగానీ.. 2014లో వచ్చినటువంటి గొప్ప అవకాశం మాత్రం మళ్లీ ఆయనకు రావడం కష్టమే! భారతదేశానికి కావలసింది భయపెట్టే ప్రధాని కాదు.. స్ఫూర్తినిస్తూ సంస్కరణల్ని నైపుణ్యంతో, అవగాహనతో సాధించే ప్రధాని అని ఆయన అర్థం చేసుకోలేకపోయారు. అధికారాన్ని ఓ మార్గంగా కాకుండా, లక్ష్యంగా భావించినట్టు పాలన చేయటంతో.. మోదీ తన ప్రస్థానం మార్గంలోనే ముగిసిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రజలను ప్రభువులుగా కాకుండా, పావులుగా చూసే కేంద్రీకృత పాలనా నమూనాచివరికి మార్క్సిస్టు పిడివాద నియంతృత్వంలాగే విఫలమవుతుందని, పోచమ్మ పోగేస్తే మాచమ్మ మాయం చేసినట్టు చివరకు బీజేపీని కూడా అస్తిత్వ సంక్షోభంలోకి నెడుతుందని ఆయన గుర్తించటం లేదు.

కచ్చితంగా తీర్మానించలేంగానీ.. మోదీలా పదుల కోట్ల మంది ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకుని దేశానికి ప్రధాని కాగల అవకాశం మళ్లీ భారత్‌కి మరికొన్ని దశాబ్దాల తర్వాతకానీ రాకపోవచ్చు! భారత్ వంటి సువిశాల, సంక్లిష్ట దేశంలో ఎప్పుడో గానీ ఇలాంటి అవకాశాలు రావు. ఒక దేశంగా ఏకకాలంలో మార్పును సాధించే అవకాశం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండియాకి కష్టమే అనుకోవచ్చు. స్వామి వివేకానంద (నరేంద్రనాథ్) తర్వాత ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ అంటే మోదీకి ఎంతో అభిమానం. పటేల్‌లా వ్యవహరిస్తూ ఉక్కుప్రధాని కావాలన్న తపన ఆయనలో కన్పిస్తుంది. కానీ పటేల్ వ్యక్తిత్వాన్ని, కార్యదీక్షాదక్షతను లోతుగా పరిశీలించి అర్థం చేసుకుని తనను తాను మలచుకునే పనిని మోదీ చేయలేదు.

మోదీలా పటేల్ ఏనాడూ రొమ్ము విరుచుకుని నడిచే ప్రయత్నం చేయలేదు. అధికారంలో ఉండటమే విజయమనుకోలేదు. గాంధీ మాటల్ని విజ్ఞతతో మన్నించి ప్రధాని పదవిని నెహ్రూకు అలవోకగా అప్పగించారు. దేశ ప్రయోజనాల కోసం ఎంత కఠినంగా వ్యవహరించారో, అంత రాజీ కూడా పడ్డారు. అందుకే ఉక్కుమనిషి అయ్యారు. భారత్–పాకిస్తాన్ తీవ్ర ఘర్షణ, అపనమ్మక వాతావరణంలో విడిపోయినా.. రెండు దేశాల మధ్య పంపిణీని ఇండియాలోని పటేల్ కార్యాలయంలో కూర్చుని ఇరు దేశాల విదేశాంగ ప్రతినిధులూ సెటిల్ చేసుకున్నారంటే, శత్రుదేశీయుల్లో సైతం వల్లభాయ్ పటేల్‌కు ఎంత విశ్వసనీయత ఉందో అర్థం చేసుకోవచ్చు! ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో హైదరాబాద్ సంస్థానం మినహాయించి నెత్తురు చిందకుండానే ఇండియాలోని 542 సంస్థానాలను ఏకం చేసిన రాజనీతిజ్ఞుడాయన.

అన్నీ సమస్యల మధ్య పటేల్ గొప్ప నాయకత్వాన్ని ప్రదర్శిస్తే.. ఎన్నో అవకాశాల మధ్య కూడా పేలవమైన నాయకత్వాన్ని మోదీ ప్రదర్శించారు. ప్రభుత్వోద్యోగులను దేశ ప్రయోజనాల దిశగా మలిచేందుకు పటేల్ గొప్ప పునాదిని వేస్తే.. వారి చేత ప్రజలకు సేవ చేయించేందుకు వీలుగా హక్కుగా 'పౌర సేవల' చట్టం వంటివి తీసుకురావడానికి కూడా మోదీ ప్రయత్నించటం లేదు.

మార్పుకి ఎప్పుడూ అవకాశం ఉంటుంది, ఏదోక మార్పు ఎప్పుడూ వస్తుంటుంది, కానీ సరైన సమయంలో సరైన మార్పు రాకపోతే మాత్రం నష్టం తీవ్రంగా ఉంటుంది. ఆ నష్టాన్ని నివారించడం లేదా కనీసం పరిమితం చేయడం సరైన నాయకత్వం చేయాల్సిన పని. అలాంటి నాయకత్వ లక్షణాల్ని మున్ముందైనా మోదీ ప్రదర్శిస్తారని ఆశిద్దాం. 2014, మే నెలలో ప్రధాని బాధ్యతలు చేపట్టిన మోదీ.. తన ఈ చివరి సంవత్సర పాలనలో ఏమైనా దిద్దుబాట్లు చేసుకునే అవకాశముందా, వచ్చే ఎన్నికల్లో గెలుస్తారా, గెలిస్తే ఏమి చేస్తారు వంటి వాటి గురించి ఇప్పుడే చెప్పలేంగానీ– ప్రస్తుత పదవీకాలంలో మాత్రం మోదీ ఉక్కుప్రధానిగా కాకుండా.. గత పాలకుల్లాగే పరిపాలించిన ఓ ఉత్తప్రధానిగానే దిగిపోయే, చరిత్ర ముందు నిలబడే అవకాశముందని ఇప్పటివరకూ ఉన్న పరిణామాలు సూచిస్తున్నాయి. ✦

# విధానాలే నాయకత్వ ప్రమాణాలు

- భరత్ ఝున్‌ఝున్‌వాలా



పరాక్రమశాలి ఇంద్రుని శౌర్యం గురించి రుగ్వేదం ఘనంగా అభివర్ణించింది. రాక్షసుడు వృత్తాను సంహరించిన ఇంద్రుడు మద్యపాన మత్తుడు, మదవతీ లోలుడు. ఒకసారి గౌతమ మహర్షి ఆశ్రమానికి వెళ్లి రుషిపత్నిని వశపరచుకున్నాడు. వాల్మీకి రామాయణం ఏమన్నదో చూడండి: 'వృత్తాను లోకం గౌరవిస్తుంది. అతనికి ధర్మం తెలుసు. ధర్మసూత్రాలకు అనుగుణంగా పాలన చేశాడు. లోపరహితుడైన వృత్తాను ఇంద్రుడు చంపివేయడం సమర్థనీయం కాదు' (ఉత్తరకాండ 84, 85 శ్లోకాలు).

నిజాయితీపరుడైన వృత్తాను కాకుండా అవినీతిపరుడైన ఇంద్రుడినే హిందువులు ఆరాధిస్తారు. కారణమేమిటి? వ్యక్తిగతంగా భ్రష్టాచారి అయినప్పటికీ ప్రజల సంక్షేమానికి దోహదం చేసిన పాలకుడు ఇంద్రుడు. లోహ పరిశ్రమలు, వ్యవసాయాన్ని ప్రారంభించి మన పుణ్యభూమిలో కాంస్య యుగానికి పునాదులు వేసినవాడు ఇంద్రుడు. వృత్తా విషయానికొస్తే వ్యక్తిగా విశుద్ధవర్తనుడే అయినప్పటికీ వ్యవసాయాన్ని, గనుల తవ్వకాన్ని, లోహాల శుద్ధిని నిరుత్సాహపరిచాడు. తద్వారా సమాజ పురోగతిని నిరోధించాడు.

సరైన విధానాలను అమలుపరచిన ఇంద్రుని వంటి అవినీతిపరుని నాయకత్వాన్ని ఆమోదించాలా లేక తప్పుడు విధానాలను అమలుపరచిన వృత్తా వంటి నిజాయితీపరుని నాయకత్వాన్ని అంగీకరించాలా? విస్మరించలేని వాస్తవమేమిటంటే సరైన విధానాలు అమలుపరిచిన దగాకోరు నాయకుల వైపే చరిత్ర మొగ్గుచూపింది. తప్పుడు విధానాలను అమలుపరచిన నిజాయతీపరుడి నాయకత్వాన్ని చరిత్ర ఆదరించలేదు.

మన ఇటీవలి గతంలో వృత్తాలాంటి నిజాయితీపరులైన నాయకులు చాలామందిని చూశాం. ఔరంగజేబునే తీసుకోండి. 'తన పూర్వీకుల వలే కాకుండా సామ్రాజ్య కోశాగారాన్ని సామ్రాజ్య పౌరుల ధర్మనిధిగా ఔరంగజేబు పరిగణించాడు. ఆ నిధిని చక్రవర్తి తన స్వప్రయోజనాలకు వినియోగించుకోకూడదని భావించాడు. ఆయన వ్యక్తిగత ధర్మనిష్ట ఎవరూ కాదనలేనిది' అని న్యూ వరల్డ్ ఎన్‌సైక్లోపీడియా వ్యాఖ్యానించింది. ఔరంగజేబు చాలా నిరాడంబర, ధార్మిక జీవనాన్ని గడిపాడు. ముస్లిం మత బోధనలను దృఢవైఖరితో సంపూర్ణంగా అనుసరించాడు. దివ్య గ్రంథం ఖురాన్‌ను ఎప్పుడంటే అప్పుడు చూడకుండా వల్లించగలిగేవాడు. హాజ్ టోపీలు తయారుచేసేవాడు. ఖురాన్‌కు నకళ్లు రూపొందించేవాడు. వీటిని అజ్ఞాతంగా విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తన వ్యక్తిగత ఖర్చులకు వినియోగించుకునేవాడు. ఆ ఆదాయంతోనే ఆయన శాశ్వత విశ్రామ నెలవును నిర్మించడం జరిగింది. ఔరంగజేబు 90 సంవత్సరాల వయసులో మరణించాడు. ఇస్లామిక్ సూత్రాల ప్రకారం ఆయన మృతదేహాన్ని ఖననం చేశారు (ఔరంగజేబు సమాధి ఔరంగాబాద్‌కు సమీపంలోని కుల్దాబాద్‌లో ఉన్నది). మరి ఈ మత నిష్టాపరుడు, ధార్మిక చక్రవర్తే హిందువులపై జిజియా పన్ను విధించాడు. వారి దేవాలయాలను ధ్వంసం చేయించాడు. తన తండ్రిని ఖైదులో పెట్టాడు. తన ముగ్గురు సోదరులను నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. గురు అర్జున్ దేవ్, గురు తేజ్ బహదూర్, గురు గోవింద్‌సింగ్‌లు అతని కాఠిన్యానికి బలయ్యారు.

నిజాయతీపరుడైన మరో నాయకుడు అడాల్ఫ్ హిట్లర్. 1932 మార్చి నెల 'అట్లాంటిక్' మేగజైన్ ఆ జర్మన్ నాయకుడి గురించి ఇలా చెప్పింది. '17 ఏళ్ల వయసులో హిట్లర్ అనాథ అయ్యాడు. చిల్లి గవ్వ కూడా అతని వద్ద లేదు. కూలీగా పొట్ట పోసుకుంటూ చదువుకున్నాడు.' హిట్లర్ గురించి బ్రిటిష్ చరిత్రకారుడు, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చరిత్ర ఆచార్యుడు రిచర్డ్ జాన్ ఇవాన్స్ ఇలా రాశాడు. 'నిజాయితీపరుడిగా హిట్లర్ పేరు పొందాడు. పక్కా ప్యూరిటన్. అవివాహితుడు, శాకాహారి, మద్యపానం, ధూమపానం అలవాట్లు ఏమాత్రం లేనివాడు. జర్మనీ అభ్యున్నతికై వ్యక్తిగత సౌఖ్యాలను త్యజించిన నాయకుడిగా ప్రజల హృదయాలలో తనను తాను సుప్రతిష్ఠించుకున్నాడు.' హిట్లర్ గురించి ఒక జోక్ ప్రచారంలో ఉన్నది. జోసెఫ్ గోబెల్స్ పిల్లలు.. గోరింగ్, హిమ్లర్ మొదలైన

నాజీ నాయకుల ఇళ్లకు విందుకు వెళ్లేవారు. విందు నుంచి తిరిగి వచ్చిన ప్రతిసారీ తమకు ఎంత రుచికరమైన విందు ఇచ్చారో మహదానందంగా చెప్పేవారు. అయితే ఒకసారి హిట్లర్ ఇంటికి వెళ్లిన ఆ పిల్లలకు కేవలం మాల్ట్ కాఫీ, సాదాసీదా బిస్కట్లు మాత్రమే ఇచ్చారట.' హిట్లర్ తన ఆత్మకథ మీన్ కాంఫ్ (నా పోరాటం) విక్రయాల నుంచి వచ్చిన ఆదాయాన్ని నాజీ కార్యకర్తల పెన్షన్లకు వినియోగించేవాడు. నిజాయితీపరుడైన ఈ నాయకుడు ప్రపంచంపై వినాశకరమైన యుద్ధాన్ని రుద్దాడు. కోట్లాది ప్రజల మరణానికి కారణమయ్యాడు. లక్షలాది యూదులను క్రూరంగా హతమార్చాడు.

నిజాయితీపరుడైన మరో నాయకుడు జోసెఫ్ స్టాలిన్. తండ్రి చర్మకారుడు. తల్లి గృహ పరిచారిక. తల్లి రష్యన్ ఆర్థొడాక్స్ క్రిస్టియన్. కుమారుడిని చర్చ్ పాఠశాలకు పంపింది. జోసెఫ్ బాగానే చదివాడు. సెమినరీలో చేరడానికి అవసరమైన ఉపకార వేతనాన్ని కూడా సాధించుకున్నాడు. సెమినరీలో కూడా అతడు మంచి విద్యార్థే. అయితే ట్యూషన్ ఫీజు చెల్లించలేక వెళ్లిపోయాడని పాఠశాల రికార్డులు చెబుతున్నాయి. కొంతకాలం ట్యూటర్‌గా, క్లర్క్‌గా పనిచేశాడు. కటిక పేదరికాన్ని అనుభవించిన వాడూ, 'క్రిస్టియన్' అయిన స్టాలిన్ తన రాజకీయ ప్రత్యర్థులను– ఒకరు కాదు ఇద్దరు కాదు అక్షరాలా వేలమందిని– క్రూరంగా హతమార్చాడు. లక్షలాది రైతులు ఆకలిదప్పులతో చనిపోయేలా చేశాడు.

చెప్పవచ్చినదేమిటి? వ్యక్తిగత నిజాయితీ, చిత్తశుద్ధి మొదలైన సుగుణాలను చూసి వృత్తా వంటి నాయకులను అనుసరించకూడదు. పాలనా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు అవినీతిపరుడైన ఇంద్రుడిలా కాదనుకుంటే.. నిజాయితీపరుడైన రాముడి మాదిరిగా సరైన విధానాలు అమలుపరుస్తున్నారా లేదా అనేదే ముఖ్యంగా చూసుకోవాలి. ఇదే నాయకత్వ దక్షతకు గీటురాయి.

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)* ✦

# విజయనగరాన్ని విలువలనగరం జిల్లాగా మార్చిన పీవీజీ



పీవీజీ లాంటి వ్యక్తులు రాజకీయాలను హుందాగా నడిపారని, అందుకే అప్పటి రాజకీయాల పట్ల ప్రజల్లో అంత గౌరవం ఉండేదని మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు కొణతాల రామకృష్ణ అన్నారు. నేడు పార్టీల్ని, నేతల్ని ప్రజలు చులకనగా చూస్తున్నారన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రవాహాన్ని తగ్గించకపోతే మున్ముందు ప్రమాదం తీవ్రస్థాయికి చేరుతుందన్నారు. విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన డా॥ పీవీజీ రాజు పురస్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పీవీజీ 95వ జయంతి సందర్భంగా.. మంచిని పెంచిన నేతలను సత్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ, విజయనగరం జిల్లాకే రాజకీయంగా ఎంతో పేరు తెచ్చిన వ్యక్తి పీవీజీ అని, తర్వాతి తరంలో సాంబశివరాజు, లగుడు సింహాద్రి, పతివాడ, డివిజి లాంటి వాళ్లు ఎన్నో సేవలు అందించారని, పురస్కారాలకు ఎంపిక చేసినవారు వారి స్థాయిలో నిజాయతీగా పనిచేశారని అన్నారు. పీవీజీ కళావేదిక కొత్త సంప్రదాయానికి తెరతీసిందని, మంచి వ్యక్తులకు సన్మానం చేసే అవకాశం తనకు లభించటం అదృష్టమని జిల్లా ఎస్పీ పాలరాజు అన్నారు. వేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, సాంబశివరాజు, నారాయణస్వామి, సింహాద్రి, శంకర్రావు, జగదీష్‌బాబులను పురస్కారాలకు ఎందుకు ఎంపిక చేసిందీ వివరించారు. విజయనగరాన్ని విలువలనగరం జిల్లాగా మార్చిన పీవీజీ స్ఫూర్తితో.. డబ్బులు పంచే వారిని ఎన్నికల్లో ఓడించాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు యడ్ల ఆదిరాజు, బీజేపీ నాయకుడు శివప్రసాద్‌రెడ్డి, వరుణ్ మోటార్స్ అధినేత చంటిరాజు, వేదిక కార్యదర్శి కొత్తా సునీల్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చిన్నంనాయుడు, వివిధ రంగాల ప్రతినిధులు, బుజ్జి, పెనుమజ్జి సత్యనారాయణ, కొరుపోలు సత్యారావు, నేరెళ్ల వెంకట్రావు, హృషీకేశం, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ✦

# కూటమి సర్కార్లు చేటు కలిగిస్తాయనడం భ్రమ

- ఆకార్ పటేల్

'హంగ్ పార్లమెంటు' అనే పదబంధం వింటేనే స్టాక్ మార్కెట్ వణుకుతుంది. మన ఆర్థిక వ్యవస్థకు పటిష్టమైన, నిర్ణయాత్మకమైన నాయకత్వం అవసరమని, ఒకే పార్టీకి మెజారిటీ లభించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోతే ఇది అసాధ్యమనుకోవడమే ఇందుకు కారణం. ఏక పార్టీ పాలన లేకపోతే సరైన ఆర్థిక నిర్దేశం ఉండదని, అందువల్ల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వృద్ధి కొరవడుతుందని, కేబినెట్‌లో స్వప్రయోజనపరులు పెరుగుతారని, నాయకత్వం చేసే పనులకు అడ్డుతగులుతారని అటువంటివారు అంటారు. మెజారిటీ పార్టీ ప్రభుత్వానికి అనుకూలంగా, కూటములకు వ్యతిరేకంగా సాగే వాదనలకు స్థూలంగా ఇదీ ప్రాతిపదిక. అయితే ఇటీవలి సంవత్సరాల్లోని ఆధారాలు ఆ ఆలోచనను బలపరిచేలా లేవు. యూపీయే తొలి దశ పాలనాకాలం (2004-09)లో అయిదేళ్లూ జీడీపీ వృద్ధి 8.5 శాతం. ఇది దేశ చరిత్రలో ఏ అయిదేళ్ల పాలనను తీసుకున్నా అత్యధికమని చెప్పాలి. కేవలం 145 స్థానాలు మాత్రమే ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దీన్ని సాధించింది. సమాచార హక్కు చట్టం వంటి అత్యుత్తమ చట్టాలు ఈ కాలంలోనే రూపొందాయి. అదే కూటమి తదుపరి ఎన్నికల్లో సైతం 200 స్థానాలు గెల్చుకుని అధికారంలోకి వచ్చింది. లెక్కప్రకారం యూపీయే-2 ప్రభుత్వానికి మరింత స్వేచ్ఛ లభించింది. గనుక అది లోగడకంటే ఎక్కువ నిర్ణయాత్మకంగా ఉండాలి. కానీ జీడీపీ గణాంకాలు దీన్ని ప్రతిబింబించవు. ఈసారి సగటున 7 శాతం వార్షిక జీడీపీ మాత్రమే నమోదైంది. అయితే ఈ కాలం ఆర్థిక సంక్షోభం నుంచి ప్రపంచం కోలుకుంటున్న దశ అని, అందువల్ల అధిక వృద్ధి సాధించడానికి అనువైన మద్దతు వెలుపలి నుంచి లభించలేదని మనం గుర్తించాలి.



నిజానికి ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఉన్న ప్రస్తుత తరుణంలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బ్రహ్మాండంగా ఉన్న ఈ సమయంలో గత పదిహేనేళ్లలో ఎన్నడూ లేనంత బలహీనమైన ఆర్థిక వృద్ధి నమోదైంది. ప్రభుత్వ పనితీరును వ్యాఖ్యానించడం నా ఉద్దేశం కాదు. స్టాక్ మార్కెట్, ఆర్థిక విశ్లేషకులు భయపడుతున్నట్టు కేంద్ర ప్రభుత్వానికుండే మెజారిటీకీ, నమోదయ్యే జీడీపీ వృద్ధికీ సంబంధం లేదని చెప్పడమే నా వివరణలోని అంతరార్థం. కూటమి ప్రభుత్వాలు ప్రధానమైన సంస్కరణలను తీసుకురాలేవన్నది మరో భయం. కానీ దినదినగండంగా బతుకీడ్చిన మైనారిటీ ప్రభుత్వాలున్న కాలంలోనే దేశంలో అత్యంత పెద్ద ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. అందరూ 'డ్రీమ్ బడ్జెట్'గా చెప్పుకునే 1998నాటి బడ్జెట్‌ను అతి తక్కువ కాలం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమే ప్రవేశపెట్టింది. ఆ ప్రభుత్వానికి కాంగ్రెస్ వెలుపలి నుంచి మద్దతిచ్చింది. కనుక ఈ చరిత్రంతా గమనిస్తే కూటమి ప్రభుత్వాలు మంచివి కావని మార్కెట్లు ఎందుకనుకుంటాయో బోధపడదు.

ప్రపంచబ్యాంకు వివిధ సంవత్సరాలలో విడుదల చేసిన ప్రపంచవ్యాప్త పాలనా సూచికల ఆధారంగా యూపీయే-1, యూపీయే-2, ఎన్డీయే ప్రభుత్వాలను పాత్రికేయుడు టీఎన్ నైనన్ పోల్చిచూపారు. అవినీతి నియంత్రణ అంశంలో మన పర్సంటైల్ ర్యాంకు 2013లో 37.0 నుంచి 2016లో 47.1కి మెరుగైంది. కానీ దీనికీ, మన్మోహన్ హయాంలో సాధించిన పర్సంటైల్ 46.8కీ పెద్దగా తేడా లేదు. ప్రభుత్వ పనితీరులో మన దేశం ర్యాంకు 2014లో 45.2 ఉండగా, 2016లో అది 57.2, అంతకు చాలాముందు అంటే యూపీయే-1 హయాం (2007)లో అది 57.3. నియంత్రణలకు సంబంధించి 2012 నాటి స్కోరు 35.1 అయితే, 2016లో అది 41.3. కానీ 2006లో అది అత్యధికంగా నమోదైంది. ఆనాటి స్కోరు 45.1. రాజకీయ సుస్థిరత, హింస లేకపోవడం విషయంలో మన ర్యాంకు ఎప్పుడూ అల్పమే. 2005లో అది 17.5, 2014లో 13.8, 2015లో 17.1.. ఆ మరుసటి

ఏడాది 14.3 (అంటే 2005నాటి కంటే ఘోరం). శాంతిభద్రతల విషయంలో 2016 (52.4).. 2013 (53.1) కన్నా స్వల్పంగా తక్కువ. కానీ 2006 (58.4)తో పోలిస్తే బాగా తక్కువ. ఈ ర్యాంకుల్లో ఆఖరి సూచిక అభిప్రాయ వ్యక్తీకరణ, జవాబుదారీతనంలో చూస్తే 2013 నాటి 61.5 ర్యాంకు 2016 కల్లా 58.6కు దిగింది. ఈ డేటా స్పష్టంగానే ఉంది. మార్కెట్లు, విశ్లేషకులు భయపడుతున్నట్టుగా 'పటిష్టమైన, నిర్ణయాత్మకమైన' ప్రభుత్వం సాధించగలిగేదీ, 'బలహీనమైన' ప్రభుత్వం సాధించలేనది అంటూ ఏదీ ఉండదని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఇది నాయకత్వ పటిమకూ, దాని గురికీ సంబంధించినది. అంతేతప్ప కీలకమైనదిగా కనబడే లోక్‌సభ అమరికతో దీనికి సంబంధం లేదు. ప్రభుత్వానికి మెజారిటీ లేకున్నా కీలకమైన జాతీయ ప్రయోజనానికి సంబంధించిన అంశం చర్చకొచ్చినప్పుడు అన్ని పార్టీలకూ ఏకతాటి మీదకు తీసుకురావడం సాధ్యమే. నిజానికి స్పష్టమైన ఆధిక్యత మనకు అంత మంచిది కాదని నేను వాదిస్తాను. మన దేశంలాంటి వైవిధ్యభరితమైన దేశంలో సాహసవంతమైన నిర్ణయం తీసుకుని అది కాస్తా వికటించడం కంటే.. ఎంతో అప్రమత్తతతో, మధ్యేమార్గం ఎంచుకోవడమే శ్రేయస్కరం. ముందే ఏర్పరుచుకున్న కొన్ని అభిప్రాయాల కారణంగానే ఏదో ఒక పార్టీకి మెజారిటీ ఉండటం మంచిదన్న ఆలోచన ఏర్పడుతుందని మనం ఒప్పుకోవాలి. ఉత్తర భారతదేశంలోని ఇటీవలి పరిణామాలు 2019లో హంగ్ పార్లమెంటు ఏర్పడవచ్చునని లేదా పాలకపక్షానికి తగినంత మెజారిటీ రాకపోవచ్చునని సూచిస్తున్న నేపథ్యంలో నేను దీన్ని రాయాల్సి వచ్చింది. 'హంగ్' రావడం లేదా పాలకపక్షానికి మెజారిటీ తగ్గడం తథ్యమని మున్ముందు సర్వేలు వెల్లడిస్తే మన మార్కెట్ విశ్లేషకులు, బిజినెస్ పత్రికలు దేశ ఆర్థిక వ్యవస్థకూ, సుస్థిరతకూ అది అంత మంచిదికాదని ఊదరగొడతారు. కానీ చరిత్ర మాత్రం అదొక సమస్య కాదని చెబుతోంది.

*(కర్టెసీ: సాక్షి)* ✦

# ఆర్టీఐ వర్తించదంటున్న పార్టీల్ని ఎన్నికల్లో తిరస్కరించాలి




సమాచారహక్కు (ఆర్టీఐ) చట్టం తమకు వర్తించదంటున్న రాజకీయ పార్టీలను రానున్న ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించాలని లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కన్వీనర్ బండారు రామ్మోహనరావు పిలుపునిచ్చారు. విశాఖ గాజువాకలోని చలపతి హైస్కూల్‌లో సమాజ్ వికాస్ సంస్థ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఐ వచ్చి 12 ఏళ్లు అయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చట్టం ప్రకారం 10 మంది ఆర్టీఐ కమిషనర్లు ఉండాల్సి ఉండగా ముగ్గురినే నియమించటం దారుణమని రామ్మోహనరావు అన్నారు. ఈ చట్టం రూపకల్పనలో లోక్‌సత్తా భాగస్వామి కావటం ఆనందకరమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గడువులోగా ప్రజలకు పనులు చేసి పెట్టేందుకు, చేయకపోతే రోజుకు రూ.250 కనీస పరిహారం చెల్లించేందుకు 'పౌర సేవల' చట్టం కోసం కూడా లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. దీని వల్ల లంచాలు, దేబిరింపులు, వేధింపులు లేకుండా ప్రజలకు సర్టిఫికెట్లు, ఇతర రోజువారీ పనులు పూర్తవుతాయన్నారు. పబ్లిక్‌ఫోరం రాష్ట్ర కో ఆర్డినేటర్ కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, ఆర్టీఐ పరిధిలోకి రాజకీయ పార్టీలు రావటంపై కేసు విచారణ పూర్తయినా తీర్పులో జాప్యం జరుగుతోందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ప్రజాప్రతినిధులు, పార్టీలు ఆర్టీఐ పరిధిలోకి రావాల్సిందేనన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో ఆర్టీఐపై అవగాహన కలిగిస్తున్నామన్నారు.

వికాస్ సంస్థ కన్వీనర్ టీవీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ ఎ.వేణుగోపాల్, సంస్థ కన్వీనర్ బి.చక్రధర్, కేవీఎస్ నర్సింహం, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సుందరరావు, రమణరాజు తదితరులు పాల్గొన్నారు. ✦

# కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ ప్రభుత్వంగా మారాలి

రాజ్యాంగం భారతదేశాన్ని సమాఖ్య (ఫెడరల్)గా అభివర్ణిస్తున్నా కేంద్ర ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అధికారాలన్నిటినీ తమ చేతుల్లో పెట్టుకోవాలని చూస్తున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక ప్రభుత్వాలకు నేరుగా అధికారాలను వికేంద్రీకరించాల్సి ఉందని, ఈ మూడో దశ ఫెడరలిజంపై దేశవ్యాప్తంగా అట్టడుగు స్థాయి వరకూ చర్చ జరగాలని అన్నారు.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై 'ఇండియా నెక్స్ట్' సంస్థ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ సమావేశం జరిగింది. ఉన్నకొద్దీ అధికార వికేంద్రీకరణ జరగాలన్న రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు వ్యతిరేకంగా.. కేంద్రీకృత పాలన పెరుగుతుండటం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక నిర్ణయాలు స్థానికంగానే జరగాలని, మంచీచెడులు అక్కడే తేల్చుకోవాలని అభిప్రాయపడింది.

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి మాట్లాడుతూ, దేశ ఐక్యతను చాటిచెప్పాల్సిన రాజ్యాంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వ పంజరంలో చిలకలుగా మారాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలను సంప్రదించకుండానే పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. రాష్ట్ర జాబితాలోని అంశాలను ఉమ్మడి జాబితాలో చేరుస్తూ అధికారాల్ని కేంద్రీకృతం చేస్తున్నారన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్రమోదీ చేసిన సమాఖ్య డిమాండ్లను ఇప్పుడు ప్రధానిగా ఆయనే తిరస్కరిస్తున్నారని అన్నారు.

అధికారాలను కేంద్రీకృతం చేయటం వల్లే సోవియెట్ యూనియన్ ముక్కలైందని కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రాందాస్ అన్నారు. తమిళనాడులోని ప్రాచీన సంప్రదాయమైన జల్లికట్టుకూ కేంద్రం అనుమతి ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఏకకాలంలో ఎన్నికలను సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా దేశం నెత్తిన రుద్దాలని ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగ నిపుణుడు, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్ మాట్లాడుతూ, ప్రతి లోక్‌సభ నియోజకవర్గాన్నీ జిల్లా యూనిట్‌గా పరిగణలోకి తీసుకోవాలన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం 1919లో తెచ్చిన చట్టం ఆధారంగా నేటికీ కేంద్రం అనే పదం కొనసాగుతోందని, ఈ ధోరణి మారాలని అన్నారు.

మనదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాతృకయిన బ్రిటన్‌లో, నియంతృత్వ చైనాలో కూడా మనకంటే ఎక్కువ అధికార వికేంద్రీకరణ ఉందని జేపీ అన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకూ కేంద్రం గుప్పెట్లో ఉందన్నారు. రాష్ట్రాల మీద పెత్తనం చేయటానికి గవర్నర్ల వ్యవస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోందన్నారు. రాజకీయ ఏజెంట్లుగా పనిచేసే సొంత మనుషులను గవర్నర్లుగా నియమించుకుంటోందన్నారు. సమాఖ్య సంస్కరణల్లో భాగంగా.. గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయటం, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి మార్పుల్ని కూడా చేసుకోవాలన్నారు. ఎన్టీరామారావు, జోతిబసు, బిజూపట్నాయక్, కరుణానిధి, రామకృష్ణ హెగ్డే వంటి వారు గతంలో రాష్ట్రాలకు అధికారాల కోసం కేంద్రంతో పోరాడారని, వారి కృషి వల్ల రాష్ట్రాలకు ఇప్పుడు నిధులు పెరిగాయన్నారు. ఇప్పుడు మూడో దశ ఫెడరలిజం కోసం పోరాటాన్ని పెంచాలన్నారు. దేశ రక్షణ, ఐక్యత, జాతీయ సమగ్రతకు భంగం కలగకుండా.. కేంద్రం-రాష్ట్రం-జిల్లాలు, స్థానిక ప్రభుత్వాలకమధ్య అధికారాలు, నిధులు తగిన నిష్పత్తిలో పంపిణీ అయ్యేలా చేయలన్నారు. కేంద్రంలో ఎంత బలమైన నాయకుడున్నా, పార్టీ వున్నా, ఎంత బలప్రయోగం చేసినా.. ఫెడరలిజం బలపడకపోతే, సాధికారత చిట్టచివరి పౌరునికీ చేరకపోతే భారతదేశం నిలబడదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు పెరిగినట్టే, ఇతర వికేంద్రీకరణ సంస్కరణలూ రావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. సదస్సులో ప్రధానమంత్రి మాజీ సలహాదారు నరేంద్ర, ఇండియా నెక్స్ట్ సంస్థ అధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం. అమరేంద్ర తదితరులు మాట్లాడారు. ✦






నైపుణ్యాలు లేని చదువులతో ఎన్ని డిగ్రీలున్నా ఏమీ లాభం ఉండదని, సరైన విద్య కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పట్టుబట్టాలని జేపీ అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా తిరుపతి అన్నమయ్య సర్కిల్‌లోని సీకాం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులతో జేపీ సమావేశమయ్యారు. సురాజ్య లక్ష్యాలను విద్యార్థుల ముందు ఉంచిన అనంతరం చర్చా గోష్ఠిలాగా విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు, ఆలోచన రేకెత్తించేందుకు ఆయన ప్రయత్నించారు.



# కోట్లాదిమంది శక్తిసామర్థ్యాలు ఇంకిపోయేలా చేస్తున్న పాలనను మార్చేందుకే సురాజ్య యాత్ర

చుట్టూ ఉన్న సమాజాన్ని కొంతమేరయినా పట్టించుకోకపోవటం వల్లే తెలుగు రాష్ట్రాలు, దేశం ఆశించిన అభివృద్ధిని సాధించలేకపోయాయని జేపీ అన్నారు. మనం సాధించగలిగిన లక్ష్యాలకు – సాధిస్తున్న ఫలితాలకు మధ్య అంతరం చాలా ఎక్కువగా ఉందన్నారు. మనదేశంలోని కోట్లాదిమంది శక్తిసామర్థ్యాలు ఇంకిపోయేలా మన రాజకీయం, పాలనా విధానాలు ఉండటమే అందుకు కారణమన్నారు. మనలోని శక్తిసామర్థ్యాలు వికసించాలంటే అందుకు పాఠశాల స్థాయి నుంచి మంచి చదువు తప్ప వేరే మార్గం లేదన్నారు. ఇప్పుడు డిగ్రీ, పీజీ చేస్తున్న విద్యార్థుల్లో కూడా మంచి స్కూలు చదువున్నవారికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కానీ దురదృష్టవశాత్తూ ఆ పరిస్థితి లేకపోవటం వల్ల డిగ్రీలు చేసినవారిలో అత్యధికులు ఉపాధి లేక అలమటిస్తున్నారని అన్నారు. ఏటా 1కోటీ 30 లక్షలమంది ఉద్యోగాల కోసం కొత్తగా వస్తుంటే, అందులో పదోవంతుకు కూడా ఉద్యోగాలను సమకూర్చలేకపోతున్నారన్నారు.


మనం ఎంతో గొప్పగా చెప్పుకునే, వీలుంటే వెళ్లి సెటిలవుదామనుకునే అమెరికా వంటి దేశాల్లో స్కూలు స్థాయిని బట్టి ఇంటి అద్దెలు, స్థలాల డిమాండ్ ఉంటుందని జేపీ అన్నారు. మన వద్ద సినిమాహాలు, వాణిజ్య సముదాయాల్ని బట్టి ఆ రేట్లు ఉంటున్నాయన్నారు. స్కూలు విద్య ఇంత ముఖ్యమైన అంశంగా అభివృద్ధి చెందిన దేశాలే భావిస్తుంటే, మనదేశంలో ఆ విషయాన్ని చర్చించటానికి కూడా నాయకులకు, అధికారులకు సమయం ఉండదన్నారు. అదేదో చాలా సామాన్యమైన విషయమన్నట్టు చిన్న వార్తలా ప్రచురిస్తారన్నారు. యువత, ఇతర ప్రజల భాగస్వామ్యంతో ఈ పరిస్థితిని మార్చడానికే సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు. పిల్లలకు చదువు అందించటానికి అప్పులు చేసి మరీ పేద, మధ్యతరగతి వారు కష్టపడుతున్నారని, విద్యకు ఉన్న ఈ డిమాండ్‌ను సరైన దిశలోకి మరల్చాలన్నారు. విద్యలో విజయానికి నిర్వచనాన్ని మార్చాలన్నారు. ప్రభుత్వాలు ఈ పనిని చేస్తే మున్ముందు వారికి కూడా ఓట్లు పడే అవకాశం పెరుగుతుందన్నారు. విద్య లేకుండా పేదరికాన్ని, వివక్షను పోగొట్టటం అసాధ్యమన్నారు.

ప్రతి ఒక్కరి జీవితాల్ని, సమాజాన్ని కూడా మెరుగుపరిచే సురాజ్య లక్ష్యాల కోసం కొంత సమయాన్ని కేటాయించేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదవ్వాలని జేపీ సూచించారు.

జేపీలాంటి సమున్నతుడు తమ కళాశాలకు విచ్చేయడం ఆనందంగా ఉందని కళాశాల ఛైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆయన్ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.

సీకాం డైరెక్టర్ ప్రణీత్ స్వరూప్, లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, కల్లూరు బాలసుబ్రమణ్యం, బెల్లంకొండ సురేష్, వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ✦






# ప్రభుత్వ ఆరోగ్య విధానం ప్రజల్ని, వైద్యుల్ని, దేశాన్నీ దెబ్బతీస్తోంది

వైద్యులపై ప్రజల్లో వ్యతిరేకత పెరగటానికి ప్రభుత్వం అనుసరిస్తున్న అర్థరహిత ప్రజారోగ్య విధానమే కారణమని జేపీ అన్నారు. ప్రభుత్వ అధ్వాన్న ఆరోగ్య విధానం వల్ల ప్రజలకు, వైద్యులకు, దేశాభివృద్ధికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన గుంటూరు సర్వజన ఆస్పత్రిని సందర్శించారు. పర్యవేక్షకుడు డాక్టర్ దేవనబోయిన శౌరిరాజునాయుడునడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం 102 విభాగానికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బల్లాపల్లి మండలం గుట్టపల్లికి చెందిన చిన్నారి డి.నాగుర్‌వలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం శుశ్రుత సమావేశమందిరంలో వైద్యులు, వైద్యవిద్యార్థులతో సమావేశమయ్యారు.

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోకి అడుగుపెట్టగానే తాను ఇక్కడ వైద్యవిద్యను అభ్యసించిన రోజులు గుర్తుకొచ్చాయని జేపీ అన్నారు. తాము చదివిన రోజుల్లో కంటే ఇప్పటి వైద్య విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అందుబాటులో ఉందని, తమలాగా పుస్తకాల మీదే ఆధారపడకుండా అధునాతన సర్జరీలను నేరుగా చూడగలుగుతున్నారని అన్నారు. అయితే తమకంటే సబ్జెక్టుకు సంబంధించి ఈతరం విద్యార్థులు ఎక్కువగా కష్టపడుతున్నా, నేర్చుకోగలుగుతున్నా ఆస్పత్రులను సందర్శించటంలో మాత్రం వెనకబడి ఉన్నారని అన్నారు. వైద్యం అంటే పుస్తకాల్లో కంటే రోగుల వద్ద నుంచే ఎక్కువ నేర్చుకోవలసి ఉంటుందన్నారు. అందుకే తమకు ఏ వార్డును కేటాయించినా, బాగా వైద్యం అందించగల ప్రొఫెసర్ ఉన్న వార్డుల్లోకి వెళ్లి నేర్చుకోవటానికి ప్రయత్నించేవారమన్నారు. వైద్య విద్యార్థులు ఆస్పత్రుల్లో ఎక్కువ సమయం గడపాలని, రోగులను అధ్యయనం చేయటం ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని, ఇందుకు తగ్గ ఏర్పాట్లను చేయాలని సూచించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్కో బెడ్‌కు మహాఅయితే ఏడాదికి రూ.7-8 లక్షలు కేటాయిస్తున్నారని, అదే కార్పొరేట్‌లో రూ.50లక్షల నుంచి 1కోటి దాకా కేటాయిస్తున్నారని జేపీ అన్నారు. సేవలలో పెద్ద తేడా లేదుగానీ, మౌలిక వసతుల్లో, సిబ్బంది అందుబాటులో ప్రభుత్వానికి-ప్రైవేటుకి తేడా ఉందన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌ను కొంతమేర పెంచి నిపుణులైన వైద్యులు ముందుకొచ్చేలా చేయాలన్నారు. ఇది పూర్తిగా ఆచరణ సాధ్యమన్నారు. ప్రజల పట్ల అంతర్లీనంగా ఉన్న చిన్నచూపు, ప్రజల్లో చైతన్యం లేకపోవటం వల్లే విద్య, ఆరోగ్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నారు తప్ప.. నిధుల కొరత ఎంతమాత్రం లేదన్నారు. వైద్యనిపుణులు, తక్కువ ఖర్చుతో మందుల తయారీ వంటి అవకాశాలు భారత్‌కు ఉండటం వల్ల కొద్దిపాటి అదనపు నిధులతోనే జనాభాలో దాదాపు అందరికీ నాణ్యమైన వైద్యాన్ని జేబులో నుంచి ఖర్చు లేకుండా అందించవచ్చున్నారు. ఇలా చిన్న మార్పులతో పెద్ద ఫలితాల్ని సాధించేందుకే సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు.

ఎన్ని తరాలు గడిచినా ఎవర్ గ్రీన్‌లా వైద్యానికి ఆదరణ ఉంటుందని, ఎప్పటి కప్పుడు ప్రమాణాలను పెంచుకుంటూ తలెత్తుకుని వైద్యులు సేవలందించాలని జేపీ అన్నారు.

వైద్యాధికారులు ఆదినారాయణ, వై.రమేష్, విభాగాధిపతులు, ఇంఛార్జి ఏడీ

## ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దుస్థితి ఇదీ..

ఏపీలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీల)లో సౌకర్యాలు దారుణంగా కొరవడ్డాయి. కొన్నిచోట్ల పీహెచ్‌సీల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇలాంటి చోట వర్షం కురిస్తే భవనంలో ఉన్నా, రోడ్డు మీద ఉన్నా ఒకటే. ఇక చాలా ఆస్పత్రుల్లో అవసరమైనంతమంది వైద్యసిబ్బంది లేరు, చాలినన్ని పడకలు లేవు. రోగులు మందులను బయట కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు సౌకర్యం సక్రమంగా లేకపోవటం కూడా పెద్ద సమస్యగా ఉంది.

★ గుంటూరు జిల్లా మన్నవ పీహెచ్‌సీ భవనం శ్లాబ్ దెబ్బతినటంతో.. వర్షం కురిస్తే డాక్టర్ గది, మందులు పంపిణీ గదిలో నీరు పారుతుంది. ఆపరేషన్ థియేటర్ ఉన్నా డెలివరీలు, ఆపరేషన్లు చేయటానికి వైద్యులు సాహసించటం లేదు. పీహెచ్‌సీ నుంచి జీబీసీ రోడ్డు వరకు రహదారి అధ్వాన్నంగా ఉంది. కాన్పు, శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో పరిస్థితి విషమిస్తే రోగిని పెదాస్పత్రికి సకాలంలో పంపలేమేమోనన్న భయాందోళనలు పీహెచ్‌సీ సిబ్బందిని వేధిస్తోంది.

★ చిత్తూరు జిల్లా మదనపల్లె మండలం పెంచుపాడు పీహెచ్‌సీ 20 ఏళ్లుగా శిథిలమవుతూ వస్తోంది. 12 గ్రామాల పరిధిలోని ప్రజలు ఈ ఆస్పత్రిపైనే ఆధారపడి ఉన్నారు. వర్షం వచ్చిందంటే ఆస్పత్రి అంతా వాన నీరే. డాక్టరు లేరు. ఆశా వర్కర్, ఏఎన్ఎం ఇక్కడ దిక్కు. పీహెచ్‌సీ ప్రస్తుతం రామసముద్రం మండలానికి మారటంతో మదనపల్లె పీహెచ్‌సీ సిబ్బంది రావటం లేదు. ఏఎన్ఎం పారాసిటమాల్, దగ్గు, జలుబు మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. ఆస్పత్రిలో లైట్లు లేవు.

★ విశాఖ ఏజెన్సీలోని ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు లేవు. ఐదు పడకలు రోగులకు సరిపోవటం లేదు. ఆరు బయట వరండాలో, బెంచీలపైన వైద్యసేవలు అందిస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడితే చీకట్లోనే మగ్గాలి. సెల్, టార్చ్ వెలుతురులోనే వైద్యసేవలు అందిస్తున్నారు.

★ దుంబ్రిగుడ పీహెచ్‌సీలో నాలుగు మంచాలే ఉండటంతో రోగులు ఆరు బయట వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. ఇక్కడా అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

★ పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు పీహెచ్‌సీలో 20మందికిగాను పదిమందే విధులు నిర్వహిస్తున్నారు. ప్రసవాల సంఖ్య పెరుగుతున్నా ఒక్క వైద్యుడే సేవలందిస్తున్నారు. ఒక్కోసారి ఫీల్డుకు వెళ్తున్నారు. ఆ సమయంలో ప్రమాదాలకు గురై ఆస్పత్రికి వస్తే వైద్యం అందే పరిస్థితి లేదు. మందులు లేకపోయినా సకాలంలో సరఫరా లేదు. రోగులకు కేటాయించిన బెడ్‌ల మీద సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు.

★ ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలోని పీహెచ్‌సీ పేరుకే 30 పడకల ఆస్పత్రి. ఉన్నది 8 పడకలే. కు.ని ఆపరేషన్లు చేయించుకున్నవారు సైతం అనేక అవస్థలు పడాల్సి ఉంటుంది. రోగులకు సెలైన్ పెట్టేందుకు రేకుల షెడ్‌ను నిర్మించారు. మహిళా వైద్యులు లేరు. పిల్లల, దంతసంబంధ వైద్యులు లేరు. ఎంఎన్‌వోలు, స్వీపర్లు, అటెండర్లు మూడేసి పోస్టుల చొప్పున తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక హెడ్ నర్సు, ఒక వాచ్‌మన్ పోస్టు కూడా ఖాళీ.

★ అనంతపురం జిల్లా కదిరి రూరల్ మండలం పట్నం పీహెచ్‌సీలో బెడ్లు సరిగా లేక ప్రసవాలు చేయటం కష్టంగా ఉంది. పట్నం, మొలకవేముల, ముదిగుబ్బ పీహెచ్‌సీలకు ఒకే వైద్యుడున్నారు. కదిరి, గుంతకల్లు సీహెచ్‌సీలలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. సివిల్ సర్జన్స్ 20 మందికి 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్స్ 23కి 15, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ 15కి 14 ఖాళీలు ఉన్నాయి.

★ బందరు మండలం చిన్నాపురం పీహెచ్‌సీలో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. ఓ డాక్టర్, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు గ్రేడ్-2 ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఎల్‌డీసీ లేక యూడీసీ ఒకరు, స్వీపర్ కం వాచ్‌మన్, ఎంపీహెచ్‌డబ్ల్యు ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు సిబ్బంది లేరు. రోగులు 20 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం వెళ్తున్నారు.

★ నెల్లూరు జిల్లా సీతారామపురం మండల కేంద్రంలో 24గంటల ఆస్పత్రిలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాలి. ఇద్దరే ఉన్నారు. 12మంది ఏఎన్ఎంలకు 7గురే ఉన్నారు. ఇద్దరు డాక్టర్లు ఉండాలి. ఒక్క డాక్టర్ కూడా లేరు. ల్యాబ్ టెక్నీషియన్, ఆయుష్ సిబ్బంది లేరు. ఫార్మాసిస్టు పోస్టు ఖాళీగా ఉంది.

విజయలక్ష్మి, లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, మాదాసు భానుప్రసాద్, కొత్త సూర్య, జిల్లా కార్యదర్శులు కె.దుర్గాదేవి, ఎం.శ్రీనాథ్‌రెడ్డి, జేబీ సురేష్, వైబీఐ నేతలు శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ✦

# చట్టసభల్లో కీచకులు

## .. మహిళలపై నేరాల కేసుల్లో ఎక్కువమంది బీజేపీవారే, ఏపీలో ఇద్దరు మంత్రులు కూడా





మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలలో బీజేపీవారే అధికంగా ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు మంత్రులు కూడా ఇందులో ఉన్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. దేశవ్యాప్తంగా మొత్తం 48 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకకేసుల్లో నిందితులుగా ఉన్నారు. అందులో బీజేపీకి చెందినవారు 12 మంది. ఆ తర్వాత ఏడుగురితో శివసేన రెండోస్థానంలో ఉంది. ముగ్గురు ప్రజాప్రతినిధులపై రేప్ కేసులున్నాయి. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో పేర్కొన్న కేసుల వివరాల ఆధారంగా నివేదిక రూపొందించినట్టు ఏడీఆర్ తెలిపింది. నివేదిక ప్రకారం, తృణముల్ కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలపై నేరాల కేసులు ఎదుర్కొంటున్నారు. టీడీపీకి చెందిన ఐదుగురిపై కేసులున్నాయి. కాంగ్రెస్-4, బీజేడీ-4, ఇండిపెండెంట్-3, ఆర్జేడీ, జేఎంఎం, డీఎంకే పార్టీల్లో ఇద్దరు చొప్పున, సీపీఎంలో ఒకరిపై మహిళలపై నేరాల కేసులు ఉన్నాయి. గత ఐదేళ్ల కాలంలో మహిళల కిడ్నాప్, గృహహింస, అక్రమ రవాణా వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న 327 మందికి ప్రధాన పార్టీలు టికెట్లు ఇచ్చాయి. 47 మందికి బీజేపీ టికెట్లిచ్చింది. బీఎస్పీ-35, కాంగ్రెస్-24, శివసేన-22, ఎస్పీ-17, టీఎంసీ-12, సీపీఎం-12, సీపీఐ-10, ఆప్-2, ఇతరులు 148 మందికి టికెట్లు ఇచ్చారు.

**ఏపీ, తెలంగాణల్లో..**

మహిళలపై నేరాల కేసుల్లో నిందితులైనవారు పెద్దసంఖ్యలో ఆయా పార్టీల నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 36 మంది, తెలంగాణలో 15 మంది పోటీ చేశారు. ఏపీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు (13), అచ్చెన్నాయుడుపై మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నాయి. వీరుకాక ధర్మవరం ఎమ్మెల్యే గొనుగొంట్ల సూర్యనారాయణ, పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పైనా కేసులున్నాయి. దేశవ్యాప్తంగా ముగ్గురు ఎమ్మెల్యేలపై రేప్ కేసు నమోదుకాగా, వారిలో గొనుగొంట్ల సూర్యనారాయణ ఒకరని ఏడీఆర్ తెలిపింది. ఇక, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన 48 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 23 మందిపై తీవ్రమైన కేసులున్నాయి. బీజేపీకి చెందిన 30 మంది, జేడీఎస్‌కు చెందిన 17 మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ✦


## కొత్త గ్రహాల వేట ప్రారంభం



TRANSITING EXOPLANET SURVEY SATELLITE

కొత్త గ్రహాలను అన్వేషించేందుకు, గ్రహాంతరవాసుల ఉనికిని తేల్చేందుకు నాసా ప్రయోగించిన 'టెస్' (ది ట్రాన్సిటింగ్ ఎక్సోప్లానెట్ సర్వే శాటిలైట్) అంతరిక్షంలోకి ప్రవేశించింది. సౌరవ్యవస్థకు ఆవల 300 కాంతిసంవత్సరాల దూరంలో నక్షత్రాల చుట్టూ పరిభ్రమించే గ్రహాలను ఇది స్కాన్ చేస్తుంది. సుమారు 20,000 గ్రహాలను ఇది అన్వేషించి, గ్రహాంతరవాసుల జాడను కనుగొనేందుకు నాసా ఈ ఉపగ్రహ ప్రయోగాన్ని చేసింది. ఈ గ్రహాల్లో కనీసం 500 వరకు భూమి పరిమాణంలో ఉంటాయని భావిస్తున్నారు. కెప్లర్ టెలీస్కోప్ కంటే మెరుగ్గా పనిచేసే టెస్.. ప్రస్తుత భూకక్ష్యలో తిరుగుతోంది. జూన్ నెలాఖరు నుంచి పూర్తిస్థాయిలో తన పనిని ప్రారంభిస్తుంది. కెప్లర్ స్కోప్ ద్వారా తారల చాటున దాగిన 4వేల గ్రహాలను కనుగొన్నారు. టెస్‌లోని నాలుగు కెమెరాలు.. ప్రతి 2 నిమిషాలకూ 2 లక్షల నక్షత్రాల ప్రకాశాన్ని పరిశీలిస్తాయి. ✦

# నవ్యాంధ్రకి ద్రోహం చేసింది ఎవరు?
# కొరడా.కాం ఛార్జిషీట్




*నోట్: ఏదో ఒక పార్టీని విమర్శిస్తేనో, ఎవరో ఒకర్ని టార్గెట్ చేస్తేనో ఆ పార్టీ/వ్యక్తి వ్యతిరేకులంతా పండగ చేసుకుంటూ ఆ ఆర్టికల్‌ని షేర్ చేస్తారని తెలుసు. అయినా ఒకే వ్యాసంలో అందరి తప్పులని ప్రస్తావించడం ద్వారా, నిజాలు తెలుసుకుందామనుకునే కొద్దిమందికి అయినా నిజాలు చెప్పాలి అనే ప్రయత్నం ఇది.*

*రాజధాని కూడా లేకుండా, భారీ రెవెన్యూ లోటుతో అక్కడి ప్రజల సమ్మతి కూడా లేకుండా దేశంలో ఏర్పడ్డ ఏకైక రాష్ట్రం నవ్యాంధ్ర. రాష్ట్ర విభజన వల్ల నష్టపోతున్న నవ్యాంధ్రప్రదేశ్‌కు ఆ నష్టాన్ని పూడ్చడం కోసం విభజనచట్టంలో కొన్ని హామీలు ఇచ్చారు. రాజ్యసభ సాక్షిగా ఆనాటి ప్రధాని ఐదేళ్లు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఇస్తామని ప్రకటన చేశారు. అయితే, రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు అవుతున్నా ఈ హామీలలో కీలకమైనవి ఏమీ అమలుకి నోచుకోలేదు. మొత్తంగా ఈ నాలుగేళ్లలో నవ్యాంధ్రకి ద్రోహం జరిగింది. ఈ ద్రోహంలో పాత్రధారులు ఎవరు? ఎవరి పాపం ఎంత? ఈ అంశాలపై ప్రజాకోర్టులో కొరడా.కాం దాఖలు చేస్తున్న ఛార్జిషీట్ ఇది..*

**ఎ1 - బీజేపీ:**

నవ్యాంధ్రకి జరిగిన ద్రోహంలో మొదటి నిందితుడు నరేంద్ర మోదీ. ఆయన బీజేపీ నుంచి ఎంపీగా ఎన్నికైనా, ఈ దేశం మొత్తానికీ ప్రధానమంత్రి. గత ప్రధాని ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత మోదీపై ఉంది. ఈ బాధ్యతని నిర్వర్తించడంలో మోదీ ఘోరంగా విఫలం అయ్యారు. ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన బీజేపీ హోదా ఇవ్వకపోవడం రాష్ట్రానికి ద్రోహం చేయడమే. రాష్ట్రం ఏర్పడ్డ రెండేళ్ల రెండు నెలలకి ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడం సాధ్యం కాదు, దానికి సమానమైన ప్యాకేజీ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ ప్యాకేజీకి కూడా చట్టబద్ధత కల్పించలేదు. మొత్తంగా ప్రత్యేకహోదా, పారిశ్రామిక పన్ను రాయితీలు, వెనుకబడ్డ ఏడు జిల్లాలకి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవేమీ అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్న బీజేపీ, మా దృష్టిలో నవ్యాంధ్రకి ద్రోహం చేసిన లిస్టులో ప్రథమ ముద్దాయి.

**ఎ2- తెదేపా:**

విభజన అనంతరం ఏర్పడ్డ నవ్యాంధ్రకి జరిగిన ద్రోహంలో రెండవ నిందితుడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. రెవెన్యూ లోటు, రాజధాని లేకపోవడం లాంటి సమస్యలతో ఉన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేంద్రంతో సఖ్యంగా ఉండి నిధులు సాధించుకోవడాన్ని ఎవరూ తప్పుబట్టరు. కానీ ఎలాంటి చట్టబద్ధత లేని ప్యాకేజీకి

ఒప్పుకోవడమే కాకుండా, "ప్రత్యేక హోదా అవసరం లేదని, కేంద్రం అన్ని రాష్ట్రాలకన్నా ఏపీకి ఎక్కువే సహాయం చేస్తోందని, హోదా సంజీవని కాదని, హోదా పేరెత్తితే జైలుకే" అని ఇలా ఇష్టం వచ్చినట్లు బాధ్యతారహితంగా మాట్లాడటం, ఇప్పుడు మళ్లీ హోదా ఆంధ్రుల హక్కు అని రెచ్చగొట్టడం ముమ్మాటికీ తప్పే. అందుకే నవ్యాంధ్రకి ద్రోహం చేసిన కేసులో రెండవ ముద్దాయి తెదేపా నే.

**ఎ3- వైకాపా:**

ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైకాపా హోదా నినాదాన్ని సజీవంగా ఉంచే ప్రయత్నం చేసిన మాట నిజం. అప్పుడప్పుడు దీక్షలు, నిరసన కార్యక్రమాలతో వైకాపా ఏపీకి ప్రత్యేక హోదా కోసం పోరాడిన మాట వాస్తవమే అయినా, తెదేపా మీద కోపంతో రాష్ట్ర ప్రయోజనాలు ఫణంగా పెట్టి మరీ బీజేపీతో దోస్తీకి వెంపర్లాడడం తప్పు. ముఖ్యంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదు అని సెప్టెంబర్ 8, 2016న అరుణ్ జైట్లీ స్పష్టంగా ప్రకటించాక కూడా మే, 2017లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి బేషరతుగా మద్దతు ఇవ్వడం ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. అంతేకాక ప్రత్యేక హోదా కోసం ఇతర సంఘాలు చేస్తున్న కార్యక్రమాలకి చాలాకాలం పాటు మద్దతు ఇవ్వకపోవడం కూడా ఆ పార్టీకి రాష్ట్ర ప్రయోజనాలకన్నా, రాజకీయ ప్రయోజనాలే మిన్న అన్న వాదనకి బలం చేకూరుస్తున్నాయి. అందుకే నవ్యాంధ్రకి ద్రోహం చేసిన కేసులో మా దృష్టిలో వైకాపా మూడవ ముద్దాయి.

**ఎ4- పవన్ కళ్యాణ్:**

రాష్ట్ర విభజన అనంతరం "పవర్ కోసం కాదు ప్రశ్నించడం కోసం" అంటూ జనసేన అనే పార్టీని ప్రకటించి, ఎన్నికల్లో తెదేపా, బీజేపీలకి ప్రచారం చేసి, వాళ్లు అధికారంలోకి రావడానికి కాస్తో కూస్తో సాయపడిన పవన్ కళ్యాణ్ నవ్యాంధ్రకు ద్రోహం చేసిన వారిలో నాలుగో ముద్దాయి. రాష్ట్రంలో అవినీతి జరుగుతున్నా, కేంద్రం విభజన హామీలని అమలు చేయకపోయినా తాను ప్రశ్నించకుండా, ప్రశ్నించేవాళ్లకి, పోరాడే వారికి మద్దతు ఇవ్వకుండా, కనీసం జరుగుతున్న విషయాలు చెబుదామని ఎవరైనా ప్రయత్నించినా వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా నాలుగేళ్లు కాలయాపన చేయడం పవన్ చేసిన తప్పు. సినిమాలు పూర్తి చేసి పూర్తిగా రాజకీయాలలోకి వద్దామనే ఆలోచనతో నాలుగేళ్లు ఆలస్యం చేసినా, ఆ తర్వాత అయినా ప్రత్యేక హోదా కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయకపోవడం పవన్ చేస్తున్న తప్పు. "మీరు అవిశ్వాసం పెడితే నేను మద్దతు కూడగడతాను" అని జగన్‌కి సవాల్ విసిరిన పవన్, పార్లమెంట్‌లో రోజుల తరబడి అవిశ్వాసంపై డ్రామా నడుస్తున్నా స్పందించకపోవడం తప్పు. తాను మద్దతు ప్రకటించిన మూడో ఫ్రంట్ నాయకుడి పార్టీ (తెరాస) లోక్‌సభలో అవిశ్వాసాన్ని కొన్ని రోజులు అడ్డుకున్నా వద్దని పవన్ మాట మాత్రంగా కూడా సూచించలేదు. అందుకే నవ్యాంధ్రకు ద్రోహం చేసిన కేసులో పవన్ కళ్యాణ్ మా దృష్టిలో నాల్గవ ముద్దాయి.

**ఎ5- మీడియా:**

తెలుగులో ముప్పైకి పైగా శాటిలైట్ న్యూస్ ఛానళ్లు, పదుల సంఖ్యలో దినపత్రికలు, వెబ్‌సైట్లు, యూ ట్యూబ్ ఛానళ్లు ఉన్నా కూడా ఆంధ్రప్రదేశ్‌కి జరుగుతున్న అన్యాయంపై ప్రజలని చైతన్యపరచడం కాదుకదా, కనీసం వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేసిన మీడియా సంస్థలు ఒకటి రెండుకి మించి లేవు. పైగా ప్రజలకి అవాస్తవాలు చెప్పడం, పార్టీలకి భజన పత్రికలుగా మారిపోవడం. శ్రీదేవి చావు, వర్మ, కత్తి మహేష్‌ల చుట్టూ డ్రామాలు ఆడడం లాంటి చర్యల ద్వారా మీడియా నవ్యాంధ్రకి ద్రోహం చేసింది. అందుకే మీడియా ఐదో ముద్దాయి.

**ఎ6- ప్రజలు:**

ప్రత్యేక హోదా సహా విభజన హామీల సాధన కోసం చలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత మూడున్నరేళ్లుగా ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయి. విభజన హామీల సాధన సమితి రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపట్టింది. సీపీఐ, సీపీఎంలు తమ శక్తి మేర పోరాటం చేస్తున్నాయి. లోక్‌సత్తా జేపీ అయితే అందరికంటే ముందే 2015 మార్చిలోనే సంకల్పదీక్షల పేరుతో ప్రత్యేకహోదా కోసం ప్రయత్నం చేశారు. లోక్‌సత్తాకి ఓట్లపరంగా పెద్దగా సత్తా లేకపోయినా శక్తి మేర ఆ పార్టీ కూడా ఏపీకి ప్రత్యేక హోదా కోసం, ఇతర విభజన హామీల అమలు కోసం ప్రయత్నం చేసింది. ఇంతమంది ఇన్ని రకాలుగా ప్రయత్నం చేస్తున్నా.. మెజారిటీ ప్రజలు కులం కుళ్లులో, అవినీతి రొచ్చులో, పార్టీల మత్తులో పడి రాష్ట్రం కోసం ఒక గంట కూడా ఆలోచించ లేకపోయారు. ఇంతమంది ఇన్ని రకాలుగా ప్రయత్నం చేస్తుంటే కనీసం ఒక్క శాతం ప్రజలైనా రోడ్డు మీదకి వచ్చి ఉంటే, ఇతరత్రా కార్యక్రమాల్లో భాగస్వాములై ఉంటే ఆ పార్టీలు రాష్ట్ర భవిష్యత్తుతో ఇలా ఆడుకునేవి కావు. ఒకసారి మద్రాసు రాష్ట్రం నుంచి తరిమివేయబడ్డా, మరోసారి హైదరాబాద్ నుంచి తరిమివేయబడ్డా, ఏ మాత్రం పౌరుషం లేకుండా, సిగ్గు లేకుండా, ఇంకా ఆ రాజకీయాలని చూస్తూ ఒక క్రికెట్ మ్యాచ్‌లాగా ఎంజాయ్ చేస్తున్న మెజారిటీ ప్రజలే మా దృష్టిలో ఆరవ ముద్దాయి. ✦

# రాజకీయాల్ని యువత పట్టించుకోవాలి



రాజకీయం అంటే ప్రజల అభివృద్ధికి ప్రధానమార్గమని, రాజకీయ పార్టీలంటే ఆసక్తి, సామర్థ్యం, నిజాయతీ ఉన్న వారు ఎవరైనా ఏ స్థాయికైనా ఎదగలిగే అవకాశాన్ని కల్పించే వేదికలని.. కానీ దురదృష్టవశాత్తూ ప్రస్తుతం రాజకీయం దోపిడీకి ప్రధానమార్గంగా తయారుకాగా, పార్టీలు ప్రైవేటు ఎస్టేట్‌లుగా మారిపోయాయని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. యువత రాజకీయాలను పట్టించుకోకపోతే ప్రస్తుత తరం కంటే కూడా ఎక్కువ నష్టపోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పి గెలిచే సత్తా లేక.. తప్పుడు రాజకీయాన్నే ప్రధాన రాజకీయంగా ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు. అలాంటి రాజకీయం నుంచి బైటపడి, తమ జీవితాల్ని బాగు చేసుకునే రాజకీయం గురించి ఆలోచించటం మొదలుపెడితేనే మార్పు వస్తుందన్నారు. లోక్‌సత్తా పార్టీలో చేరిన పలువురు యువతను విజయనగరంలో బాబ్జీ కండువా వేసి ఆహ్వానించారు. యువత తమకున్న అవకాశాలు, వనరులు బట్టి పార్టీలో ఎక్కడికక్కడ భాగస్వాములు కావాలని, మొక్కుబడిగా పనిచేయకుండా ఫలితాల్ని సాధించేలా బాధ్యతల్ని నెరవేర్చాలని బాబ్జీ కోరారు.

# ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దు



మునిసిపాలిటీ పరిధిలో హెచ్చెల్సీ ట్యాంకు నుంచి రాయదుర్గం పట్టణానికి సరఫరా అయ్యే మంచినీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వెంకటరమణబాబు అన్నారు. తాగటానికి పనికిరాకుండా నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారన్నారు. మునిసిపాలిటీ సరఫరా చేస్తున్న నీటిని క్యాన్‌తో తీసుకెళ్లి డీఈ పొరాళ్లు సురేష్, డిప్యూటీ తహసీల్దార్ బాలకిషన్‌కు చూపించి ఫిర్యాదు చేశారు. కణేకల్లులో నిర్వహించిన ఫిర్యాదుల కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. పదిరోజుల నుంచీ ఇలాంటి నీరు వస్తోందని, తాగినవారిలో పలువురు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. దీనిపై తగిన చర్యలకు వారు హామీ ఇచ్చారు. కాగా, రాయదుర్గానికి మంచినీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతు చేసినట్టు, ట్యాంకును శుభ్రం చేయిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ మోతీకృష్ణ వెల్లడించారు. ప్రజలు నీటిని వేడిచేసి వడపోసుకుని తాగాలని సూచించారు. త్వరలోనే శుద్ధమైన నీటిని సరఫరా చేస్తామన్నారు. తాగునీటి జాగ్రత్తలపై ప్రజల్లో ప్రచారం చేయటం, మంచినీరు వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటం ఎందుకు చేయలేదు అన్న ప్రశ్నకు మాత్రం అధికార యంత్రాంగం నుంచి సమాధానం లేదు. ✦

# పందులు, దుర్గంధం, నీటి ఎద్దడి..
# పట్టణ సమస్యలను అధికారులకు వివరించిన లోక్‌సత్తా

విజయనగరం పట్టణంలో సమస్యల పరిష్కారంపై అధికారుల అలసత్వాన్ని లోక్‌సత్తా నేతలు కలెక్టర్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే పట్టణంలో నీటిఎద్దడి పెరిగిపోయిందని, కొన్ని ప్రాంతాల్లో బురద నీరు వస్తోందని, రక్షిత తాగునీటికి ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. పలు ప్రాంతాల్లో దుర్గంధం పెరిగి దోమలు విజృంభిస్తున్నాయని, పారిశుద్ధ్యానికి చర్యలు చేపట్టాలన్నారు. పందుల దాడుల నుంచి ప్రజల్ని రక్షించాలని కోరారు. వార్డు స్థాయి నుంచి అధికారుల అలసత్వం వల్ల ప్రజల సమస్యలు పెరుగుతున్నాయని, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలందించేలా చేయాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు మొల్లేటి చిన్నారావు, తాత్రాజు రాజారావు, లెంక లక్ష్మణరావు, తాత్రాజు పెంటబాబు, రొక్కం గురునాధం తదితరులు పాల్గొన్నారు. ✦

# లోక్‌సత్తాలో చేరిన యువత



జనాభాలో అత్యధికంగా ఉన్న యువతకు.. కులం, మతం, డబ్బుతో ప్రమేయం లేకుండా రాజకీయాల్లో సరైన దిశలో ఎదిగే అవకాశాల్ని కల్పించేందుకే డా॥ జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా వేదికను నిర్మించారని పార్టీ విజయనగరం పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు (నాయుడు) అన్నారు. 24వ వార్డుకు చెందిన యువకులు పెద్దసంఖ్యలో లోక్‌సత్తాలో చేరిన సందర్భంగా వారిని కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణంలో అనేక ప్రజాసమస్యలు ఉన్నాయని, పార్టీలో చేరిన యువత వాటిపై నిర్దిష్ట పరిష్కారాలతో స్పందించాలని చిన్నారావు కోరారు. సమర్థత, నిజాయతీ ఉన్నవారు లోక్‌సత్తాలో ఏ స్థానానికైనా వేగంగా ఎదగవచ్చున్నారు. పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి తాత్రాజు రాజారావు మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయ పార్టీల తీరు చూసి చాలామంది యువత దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. యువతకు సరైన దిక్సూచి, వేదిక లోక్‌సత్తా అన్నారు. ప్రభుత్వాలు రోజూ కోట్లు ఖర్చు చేస్తున్నా.. అభివృద్ధి మాత్రం లేదని, వాటిపై లోక్‌సత్తా పరిష్కారాలతో ప్రజలను చైతన్యపరచాలన్నారు.

**24వ వార్డు లోక్‌సత్తా పార్టీ కమిటీ**

విజయనగరం 24వ వార్డు లోక్‌సత్తా అధ్యక్షుడిగా రెడ్డి రామునాయుడు, ఉపాధ్యక్షుడిగా లెంక లక్ష్మణరావు, కార్యదర్శిగా తాత్రాజు పెంటబాబు, సహాయ కార్యదర్శులుగా దనియాల శ్రీను, తాత్రాజు అనీల్, కమిటీ సభ్యులుగా వాళ్లే శ్రీనివాసరావు, నేరూరి రాజు, మజ్జితౌడు బాబు, గెద్ద నారాయణరావు, సైలాడ చంద్రరావు, రౌతు ఉమా, వాళ్లే త్రినాథరావు, చంద్రక ఆనంద్, పెదమజ్జి ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు శ్రీను, ఆదీశ్వరరావు, ఎర్నిబాబు అభినందించారు.

# ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించండి





రాయదుర్గం పట్టణం గౌడ లేఅవుట్‌లోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని లోక్‌సత్తా నియోజకవర్గ ఇంఛార్జి బాబు డిమాండ్ చేశారు. సమస్యల్ని తెలుసుకునేందుకు లేఅవుట్‌లో ఆయన పర్యటించారు. కాలనీ ఏర్పడి అనేక సంవత్సరాలు గడచినా కనీస వసతులు ఇప్పటిదాకా లేవని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల దాదాపు 150 కుటుంబాలు నాగరికతకు దూరంగా బతకాల్సి వస్తోందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి నాలాల్ని ఏర్పాటు చేయటంతోపాటు కాలనీలో పాఠశాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సమస్యలు లేని సమాజ నిర్మాణం కోసమే ప్రజావేదిక

ఏ తరంలోని సమస్యలు ఆ తరంలోనే పరిష్కారమై, కొత్తతరానికి పాత సమస్యలు లేకుండా చేయటం కోసమే ప్రజావేదిక ఏర్పాటైందని వేదిక కన్వీనర్ వెంకటరమణబాబు అన్నారు. పార్టీలు, కుల, మతాలకతీతంగా వేదికను ఏర్పాటు చేశామన్నారు. ప్రజావేదిక రాయదుర్గం నియోజకవర్గ సమావేశంలో కార్యదర్శి ఏటీఎల్ గోవిందు, సభ్యులు ఫణి భూషణ్, గౌరవ శ్రీనివాసులు, ఉలిగప్ప, గోవిందు, గోపి, లోకేష్, మురళి తదితరులు పాల్గొన్నారు. ✦

## పౌర సేవల చట్టం తేవడానికి సహకరిస్తాం: జానారెడ్డి

పరిపాలనలో పారదర్శకత పెరిగి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవలు మెరుగయ్యేందుకు ఉద్దేశించిన పౌర సేవల చట్టం బిల్లుకు కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలంగాణ సీఎల్పీ నేత కె.జానారెడ్డి తెలిపారు. ఈ చట్టం తెస్తామని గతంలో ముఖ్యమంత్రి మాట్లాడారని గుర్తుచేశారు. హక్కుగా పౌర సేవల చట్టం తయారీపై ప్రజాప్రతినిధులతో చర్చించి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. సరైన చట్టాన్ని తేవాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల చట్టాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రికి పంపామని, కాంగ్రెస్ పార్టీ తరపున కూడా మద్దతివ్వాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా।। పాండురంగారావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు జానారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

## స్వార్థపరులకు భవిష్యత్తు పట్టదు!

'అయితే నాకేంటి?' అని ఆలోచించే అహంకారులు, గర్విష్టులు, సార్థపరులకు.. భవిష్యత్తుకు సంబంధించిన దృష్టే ఉండదట! స్వీడన్ పరిశోధకులు చెబుతున్నారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో లబ్ధి పొందడం ఎలా?' అని మాత్రమే ఆలోచిస్తే.. మెదడు పనితీరు తదనుగుణంగా మారిపోతుందని, భవిష్యత్ ఆలోచనలు చేసే భాగాలు చైతన్యహీనంగా మారిపోతాయని వారు అంటున్నారు. యూనివర్సిటీ ఆఫ్ జెనీవాకు చెందిన టోబియాస్ బ్రోచ్ బృందం ఈ పరిశోధన సాగించింది. "కనులపై ఉండే వెంట్రోమెడికల్ ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ అనే మెదడు భాగంపై పరిశోధన సాగించాం. భవిష్యత్ ఆలోచనలు చేసే కీలక భాగమిది. నిజాయితీగా ప్రవర్తించేవారిలో ఇది చైతన్యంగా ఉంటోంది. అహంకారుల కార్టెక్స్ మాత్రం చాలా అచేతనంగా ఉంటోందని తేలింది" అని బ్రోచ్ వెల్లడించారు.

## స్ఫూర్తిప్రదాత వావిలాల




స్వాతంత్ర్య సమరయోధునిగా, సామాజిక రాజకీయ ఉద్యమకారునిగా, గ్రంథాలయ నిర్మాతగా వావిలాల గోపాలకృష్ణయ్య కృషి నేటి తరానికి స్ఫూర్తి అని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం ఉడా కాలనీలో ఏర్పాటు చేసిన వావిలాల వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, ఉపాధ్యక్షురాలు సుభద్రాదేవి, మహారాజా సంస్కృత కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ స్వప్న హైందవి, గిరిజా ప్రసన్న, దేవరశెట్టి శ్రీరామమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకులు పవిత్ర హృదయంతో పనిచేయాలి



నాయకత్వంలో ఉన్నవారు పవిత్ర హృదయంతో పనిచేయాలని, అప్పుడే బాబా ఆశీస్సులు అందుతాయని విజయనగరం బాబామెట్టలో ఉన్న దర్బార్ షరీఫ్ షా ముతావల్లి అతావుల్లా తాజ్ ఖాదిరీబాబా అన్నారు. 59వ సుగంధ మహోత్సవంలో పాల్గొన్న లోక్‌సత్తా బాబ్జీ, సీనియర్ శాసన సభ్యుడు పతివాడ నారాయణస్వామి నాయుడు, కాంగ్రెస్ నేత శంబంగి వెంకట చినఅప్పలనాయుడులను ఆశీర్వదిస్తూ ఆయనీ మాటలు అన్నారు. కార్యక్రమంలో గీతాకృష్ణ, రాజారావు పాల్గొన్నారు. ✦

# ఎన్నారై నిధుల్లో భారత్ అగ్రస్థానం



ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పంపే డబ్బుకవిషయంలో భారత్ గతయేడాది అగ్రస్థానంలో నిలిచింది. భారతీయులు గత సంవత్సరం సుమారు రూ.4.50 లక్షల కోట్లు (69 బిలియన్ డాలర్లు) తమ కుటుంబాలు, సన్నిహితులకు పంపారు. 64 బిలియన్ డాలర్లతో చైనా రెండోస్థానంలో నిలవగా, ఫిలిప్పిన్స్ (33 బిలియన్ డాలర్లు), మెక్సికో (31 బిలియన్ డాలర్లు) తరువాతి స్థానాల్లో నిలిచాయి.

గత దశాబ్దకాలంలో ప్రవాస భారతీయులు పంపే నిధులు ఎంతో పెరిగాయి. 2007లో 37.20 బిలియన్ డాలర్లు మాత్రమే భారత్‌కు వచ్చాయి. అప్పుడు చైనా (38.40 బిలియన్ డాలర్లు) అగ్రస్థానంలో ఉండేది. 'వలసలు, అభివృద్ధి' పై ఇటీవల విడుదల చేసిన ఓ అంతర్జాతీయ నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. అందులోని మరిన్ని ముఖ్యాంశాలు:

+ ప్రపంచవ్యాప్తంగా చూస్తే వివిధ దేశాలకు వలసపోయిన 20 కోట్లమంది 613 బిలియన్ డాలర్ల (రూ.39.84 లక్షల కోట్లు)ను తమ బంధువులు, కుటుంబాలకు గతేడాది పంపించారు. 2007లో ఇది 296 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ 20 కోట్ల మంది ప్రస్తుతం 80 కోట్ల మంది కుటుంబసభ్యులకు అండగా ఉంటున్నారు.

- మొత్తం నిధుల్లో 80శాతం భారత్, చైనా, ఫిలిప్పిన్స్, మెక్సికో, పాకిస్తాన్ వంటి 23 దేశాలకు తరలాయి.
- అమెరికా, సౌదీ అరేబియా, రష్యా దేశాల నుంచి అధికంగా ప్రవాసీలు నిధులు పంపించారు.
- గత దశాబ్దంలో ఆసియాకు ప్రవాసీలు పంపే నిధులు 87శాతం పెరిగి 244 మిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో వలసలు 33శాతం పెరిగాయి.
- ప్రపంచవ్యాప్తంగా ప్రవాసీలు పంపే నిధుల్లో ఆసియా వాటా 55శాతం, 2015-2030 మధ్య అల్ప, మధ్య ఆదాయ దేశాలకు 6.5 ట్రిలియన్ డాలర్ల నిధులు వచ్చే అవకాశముందని అంచనా.
- అభివృద్ధి చెందిన దేశాలలో పనిచేసే జనాభా తగ్గుతున్నందున వలసదారులకు గిరాకీ మరింత పెరగనుంది.

### ఓటు హక్కు కోసం ఎన్నారైల ఎదురుచూపులు

ఇతర దేశాలకు వెళ్లి నివసిస్తున్న వారిలో కూడా ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానంలో ఉంది. అత్యధికసంఖ్యలో భారతీయులు (వీరిలో ఎక్కువ కేరళకు చెందినవారు) గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, యూకే, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ దేశాలు ఉన్నాయి. ప్రవాస భారతీయులకు స్వదేశంలో జరిగే ఎన్నికల్లో పాల్గనే అవకాశం ఉండటం లేదు. తాము నివశిస్తున్న దేశం నుంచి నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే సదుపాయం లేదు. తమకు భారత్‌లో ఓటు హక్కు కల్పించాలని ఎంతోకాలంగా ఎన్నారైలు కోరుతున్నారు. కానీ చట్టపరమైన అవరోధాలతో ఇంతవరకూ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 20, 20ఏ కింద మార్పులు చేయాల్సిన అవసరమున్నట్టు న్యాయనిపుణుల విశ్లేషణ. ఈ చట్టసవరణ చేసి ఎన్నారైలకు ఓటు హక్కు ఇవ్వాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. వివిధ కారణాల వల్ల ఇతర దేశాల్లో నివసిస్తున్నవారికి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 115 దేశాలు ఓటు హక్కును కల్పించాయి. ఇందులో 20 ఆసియా దేశాలున్నాయి. ఆస్ట్రేలియా 1902 నుంచీ ఈ అవకాశాన్ని కల్పించింది. సముద్రంలో తిరిగే తమ దేశ నావికులు, జాలరులకు ఓటేసే అవకాశాన్ని ఐర్లాండ్ వందేళ్ల క్రితమే కల్పించింది. విదేశాల నుంచే ప్రాక్సీ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంది. ఇటీవలికాలంలో ఈ–ఓటింగ్ విధానాన్ని అమలుచేస్తున్నారు.

■ 200 డాలర్లు (సుమారు రూ.13,000), 300 డాలర్లు (రూ.19,000) ఇలా చిన్న మొత్తాలే ఆయా కుటుంబాలకు 60శాతం ఆదాయం సమకూరుస్తున్నాయి.

### అంచనాలు మించేందుకు కారణమైన అంశాలు

2016తో పోలిస్తే 2017లో నగదు బదిలీ అంచనాలకు మించి పెరిగేందుకు ఐరోపా, రష్యా, అమెరికాల వృద్ధే కారణమైందని నివేదిక తెలిపింది. ఇంధన ధరల పెరుగుదల, యూరో, రూబుల్ బలపడటం ఉపకరించాయి.

### 2018లో వృద్ధి కొనసాగుతుంది

అమెరికా సహా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు పటిష్టంగా ఉండటం వల్ల, అంతర్జాతీయంగా నగదు బదిలీ ఈ ఏడాది మరింత పెరిగే అవకాశముందని నివేదిక అంచనా వేసింది. చమురు ధరలు పెరగడం గల్ఫ్ దేశాలకు సానుకూలంగా పరిణమిస్తుందని పేర్కొంది. తక్కువ, మధ్యస్థాయి ఆదాయం కలిగిన దేశాలకు 2017తో పోలిస్తే 4.1 శాతం అధికంగా 485 బిలియన్ డాలర్లు, అంతర్జాతీయంగా 4.6 శాతం ఎక్కువగా 642 బిలియన్ డాలర్లు బదిలీ అవుతాయని అంచనా.

### బదిలీ ఖర్చు గణనీయం

అంతర్జాతీయంగా 200 డాలర్ల బదిలీకి అవుతున్న సగటు వ్యయం 2018 తొలి త్రైమాసికంలో 7.1 శాతానికి చేరింది. ఇది 3 శాతంగా ఉండాలన్నది లక్ష్యం. ఆఫ్రికా దేశాల్లో మరింత అధికంగా 9.4 శాతంగా ఉంది.

### బదిలీ వ్యయం తగ్గింపునకు అవరోధాలు

అధిక నష్టభయం ఉందనే కారణంతో బ్యాంకులు ఒప్పందాలు చేసుకోకపోవడం, కొన్ని ఖాతాలను మూసివేయడం, జాతీయ తపాలా కార్యాలయాలు– నగదు బదిలీ సంస్థల మధ్య ప్రత్యేక ఒప్పందాల వల్ల నగదు బదిలీ ఖర్చు పెరుగుతోంది. మరింత సమర్థంగా పనిచేసే సాంకేతిక వ్యవస్థలైన ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ యాప్స్, క్రిప్టో కరెన్సీ, బ్లాక్‌చెయిన్ సాంకేతికతను వినియోగించకుండా నిరోధించడం ఇందుకు కారణం.

■ ఖర్చులు తగ్గితే కనుక, తమవారు పంపే నగదులో అధిక మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులు అందుకోగలుగుతారు. ఆర్థిక సంస్థలు ప్రత్యేక భాగస్వామ్యాలు వదిలేస్తే, ఈ రంగంలో పోటీ పెరిగి, ఖాతాదారులకు మేలు జరుగుతుంది.

■ ఒక దేశం నుంచి మరో దేశానికి తాత్కాలిక ప్రాతిపదికన వెళ్లి పనిచేసుకుంటున్నవారు, స్వదేశానికి నిధులు పంపడం వీలుకాదు. శాశ్వత వలసలే దీనికి పరిష్కారం. అయితే ఈ వంకతో మనుషుల అక్రమ స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉంది. ✦

# ఉపాధిలేని చదువుల ఉపద్రవం ముంచుకొస్తోంది

రాష్ట్రంలో ఉపాధిలేని చదువులు పెద్ద ఉపద్రవంగా మారుతున్నాయని జేపీ హెచ్చరించారు. ఎంత ఎక్కువ చదువు కుంటే అంత నిరుద్యోగం అనే పరిస్థితి పెరిగిపోతోందన్నారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అన్నారని, జాబు ఎక్కడో కనుచూపు మేరలో కనిపించటం లేదని అన్నారు. ఉద్యోగాలను సృష్టించే ఆర్థిక విధానాలను అమలు చేయలేక పోవటంతోపాటు.. సమాజానికి పనికొచ్చే పనులు చేసి ఉపాధిని పొందగలిగే విద్యను అందించకపోవటం కూడా ఇందుకు కారణమన్నారు.

అనంతపురం జిల్లా జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఓబుళదేవర చెరువులోని మస్తాన్ విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ సమావేశమయ్యారు.

ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన చదువును అందించటం లేదని, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి చదువుకోండని విద్యావ్యాపారాన్ని ప్రోత్సహిస్తోందని జేపీ అన్నారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో మంచి ప్రమాణాల విద్య, వైద్యం అందించటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. సమాజంలో నిరుపేదలు కూడా విద్య కోసం అర్రులు జాస్తుంటే, మంచి విద్యనందించి ఓట్లు సంపాదించు కునే రాజకీయం చేయకుండా.. పనికిమాలిన విద్య, తాత్కాలిక తాయిలాల రాజకీయం చేస్తూ కోట్లాది ప్రజలను శాశ్వతంగా పేదరికంలో కొనసాగిస్తున్నా రన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారన్నారు. కుట్రలాగా ఒక పథకం ప్రకారం జరుగుతున్న ఈ రాజకీయాన్ని, పాలనను మార్చేందుకే సురాజ్య యాత్ర అన్నారు.

పేరుకు ప్రభుత్వం స్కూలు విద్యార్థుల మీద ఏటా రూ.23,000కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ 8వ తరగతి చదువుతున్న వారిలో పలువురికి సరిగా చదవడం రాదని, 50శాతానికిపైగా 3వ తరగతి లెక్కలు కూడా చేయలేని స్థాయిలో ఉ న్నారని జేపీ అన్నారు. ఆ పునాది మీద అందిస్తున్న ఉన్నత విద్య కూడా అధ్వాన్నంగా ఉండటంతో ఇంజినీరింగ్ కళాశాలల్లో డిగ్రీలు తీసుకుని బైటికి వచ్చినవారిలో 80శాతానికి ఉపాధి దొరకడం లేదన్నారు. చదివింది ఒకటయితే, పొట్ట కూటి కోసం ఇంకో పని చేయాల్సి వస్తోందన్నారు. కొందరైతే నేరాలకు పాల్పడటానికీ సిద్ధపడు తున్నారన్నారు. నెలకు 10లక్షల మంది ఇలా ఉద్యోగం కోసం యువత కొత్తగా వస్తున్నారన్నారు. 'నేరం నాది కాదు కనీస అవసరాలది' అంటూ రేపు వీరిలో కొంతమంది రోడ్లెక్కి దోపిడీలు, అరాచకాలకు పాల్పడితే ప్రభుత్వం ఆపగలదా? అని ప్రశ్నించారు. మనిషికో పోలీసును పెడతారా? నిరుద్యోగ భృతితో, మత్తుపదార్థాల్లాంటి తాయిలాల స్కీములతో యువతను బిచ్చగాళ్లని, బానిసల్ని చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాలకు సంకల్పం ఉంటే.. నిరుద్యోగ యువతకు గౌరవ ప్రదమైన ఉపాధిని అందించటం పూర్తిగా సాధ్యమని జేపీ అన్నారు. ఇందుకోసం యువత ముందుకొస్తే వారి పక్షాన లోక్‌సత్తా పోరాటం చేస్తుందన్నారు.

విద్యార్థులు ఒత్తిడి లేకుండా మంచి చదువును అందుకోవాలని, వ్యాయామాన్ని, క్రీడలను చదువులో భాగం చేసుకోవాలని జేపీ అన్నారు. సాంకేతిక నైపుణ్యాల్ని పెంపొందించు కోవాలన్నారు. సమాజంలో పరిస్థితులను పట్టించుకోవాలన్నారు. రోజుకు రూ.11వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నా.. సరైన విద్య, వైద్యం ఎందుకు అందటం లేదో, లంచాలు ఎందుకు పెరుగుతున్నాయో, మహిళలకు భద్రత ఎందుకు లేదో, వ్యవసాయం ఎందుకు నాశనమవుతోందో ఆలోచించకపోతే.. ఎప్పటికీ మనం ఎదగలేమని, పేదలు పేదలుగానే కొనసాగుతుంటారని, తక్కువ కులం-ఎక్కువ కులం వివక్షలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. మనం సంఘటితంగా పరిష్కారాల కోసం ప్రయత్నం మొదలుపెడితే పాలకులు మారతారని, మార్పు మొదలవుతుందని అన్నారు. సంఘటితంగా చిన్న ప్రయత్నా లతో మార్పు కోసం ప్రయత్నించేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ లలో నమోదవ్వాలని సూచించారు.

ప్రిన్సిపల్ ఖాజాహుస్సేన్ అధ్యక్షత వహించగా, వెంకటరమణ, రెడ్డెప్ప, ఎస్ఐ సత్యనారాయణ, అబ్దుల్ హుస్సేన్, లోక్‌సత్తా, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ✦

# అందరికీ సౌకర్యాలు కావాలంటే పరిశ్రమలు రాక తప్పదు

వివక్ష లేకుండా మనలో ప్రతి ఒక్కరికీ సౌకర్యాలు, అవకాశాలు కావాలంటే పరిశ్రమలు రాకతప్పదని, అయితే ఈ క్రమంలో వ్యవసాయం నష్టపోకుండా చర్యలు తీసుకునే అవగాహనను, ముందుచూపును పాలకులు, దేశ ప్రజలు ప్రదర్శించాలని జేపీ అన్నారు. ఈ ఆలోచన కొరవడటం వల్లే పరిశ్రమల స్థాపనను, వ్యవసాయాన్ని పరస్పర విరుద్ధంగా చూపుతూ ఓట్లు దండుకునే రాజకీయం చేస్తున్నారన్నారు. నూతన విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసే బాధ్యతను వ్యవసాయ విద్యార్థులు తీసుకోవాలన్నారు.

గుంటూరు జిల్లా బాపట్ల అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులతో సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సమావేశమయ్యారు.

ప్రపంచ దేశాల్లో వ్యవసాయం భారత్‌లోనే ఎక్కువగా జరుగుతోందని, చేపల ఎగుమతిలో ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్నామని జేపీ అన్నారు. వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు కొత్తగా ఆలోచించి వినూత్న ఆవిష్కరణలను చేస్తే రైతుకు భారం తగ్గి ఉత్పాదకత, దేశానికి ఆహారభద్రత పెరుగుతాయని అన్నారు. పౌష్టికాహార లోపం వంటి సమస్యల్నీ అధిగమించ వచ్చున్నారు.

రైతు మనుగడ ప్రభుత్వాల విధానాలతో కూడా ముడిపడి ఉందని, పాలకులు విధిస్తున్న అసంబద్ధ ఆంక్షల వల్ల తరచూ రైతుల ఆదాయానికి గండి పడుతోందని జేపీ అన్నారు. ఈ విధానపరమైన వైఫల్యాల గురించి కూడా వ్యవసాయ విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. రైతులకు ఆదాయం పెరిగితే పరిశోధనలకు కూడా గిరాకీ పెరుగుతుందన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో మార్పుల్ని తెచ్చి జేబులో నుంచి ఖర్చు లేకుండా నాణ్యతతో అందిస్తే రైతులకు ఎంతో భారం తగ్గుతుందని, వీటన్నిటి కోసమే సురాజ్య ఉద్యమమని వివరించారు. మనదేశంలో పౌరసత్వాన్ని పెంచే చదువు అందటం లేదని, సమాజానికి, పర్యావరణానికి దూరంగా కృత్రిమ బోధన జరుగుతోందని అన్నారు. డిగ్రీలు పొందటమే చదువుగా భావించడానికి మనం స్వస్తి చెప్పాలన్నారు. సరైన వ్యక్తిత్వం, నైపుణ్యాలు గల సమగ్ర వ్యక్తులను తీర్చిదిద్దటమే విద్య లక్ష్యం కావాలన్నారు.

## చిలుక కథ నేటి చదువులకు అతికినట్టు సరిపోతుంది

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ప్రచురించిన 'చిలుక చదువు' అనే బుక్‌లెట్‌ను జేపీ ఈ సందర్భంగా విడుదల చేశారు. ఎప్పుడో వందేళ్ల క్రితం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన చిలుక కథను ఫోరం పునర్ముద్రించటం అభినందనీయమన్నారు. ఆ కథ నేటి చదువులకు అతికినట్టు సరిపోతుందన్నారు.


కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఇంఛార్జి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాధాకృష్ణమూర్తి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీపీ సాయిబాబు, ప్లాంట్ పాథాలజీ శాఖాధ్యక్షుడు డాక్టర్ పి. అనీల్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండ్రెడ్డి సత్యనారాయణ, ఇక్కుర్తి లక్ష్మీనరసింహ, లోక్‌సత్తా, వైటీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు. ✦




### పిల్లలు ఎలా చదువుతున్నారో గమనించండి

మనకు చదువంటే ఎంతో గౌరవం, ఆకర్షణ ఉన్నా చదువు విలువేంటో, అందుకోసం ఏం చేయాలో స్పష్టత లేదని, దీన్ని ఆసరాగా చేసుకునే పాలకులు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని జేపీ అన్నారు. తల్లిదండ్రులు సంపాదన మోజులో పడి, ర్యాంకులు, మార్కుల భ్రమలో పడి పిల్లల చదువుల్ని యాంత్రికంగా మార్చవద్దన్నారు. పిల్లలు వికసించేలా, వారిలో పరిష్కార శక్తి పెరిగేలా, ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడగలిగేలా నైపుణ్యాలు సంతరించుకునేలా చదువు ఉన్నదా, లేదా అనేది ఎప్పుడూ గమనిస్తుండాలన్నారు. పిల్లలు ఆస్తిలాంటివారన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా తయారుచేయాలన్నారు. బాపట్ల కర్లపాలెం మండలం యాజలి జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సురాజ్య యాత్రలో జేపీ సమావేశమయ్యారు. ఎన్నో వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను సాధ్యమైనంత ఎక్కువగా అందిపుచ్చుకోవాలని సూచించారు. పాఠ్యాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే ప్రశ్నించగలమని, కొత్తగా ఆలోచించగలమని, అందుకే ఉపాధ్యాయుల వెంటపడి నేర్చుకోవాలని అన్నారు.

# చేనేతలు ఆదాయమార్గాల మీద దృష్టి పెట్టాలి



చేనేతల దుస్థితికి కేవలం ప్రభుత్వాల్ని నిందిస్తే సరిపోదని, నేతకారులకు ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని జేపీ అన్నారు. ఏమి చేస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుంది, కార్మికులకు ఎదిగే అవకాశాలు లభిస్తాయి అనే చర్చ అవసరమన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా కోడుమూరులో చేనేత కార్మికులను జేపీ కలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను, స్థితిగతులను ఆరా తీశారు. ధూపం మహాదేవి, గడిగ పొట్టెప్పల ఇళ్లను సందర్శించి మగ్గాలను పరిశీలించారు.

"చేనేత వృత్తినే నమ్ముకుని తరతరాలుగా బతుకీడుస్తున్నాం. ఈ పని తప్ప ఇతర పనులు చేతకాదు. మారిన జీవన విధానాలు, చేనేత రంగం పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో తీవ్రంగా నష్టపోతున్నాం. కుటుంబమంతా రోజు మొత్తం కష్టపడి మగ్గం నేస్తే రూ.100 రాని పరిస్థితి నెలకొంది. కుటుంబాలను పోషించేందుకు అప్పులు చేసి చివరకు అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 40 ఏళ్లకే రోగాలు చుట్టుముడుతుండటంతో చేనేత వృత్తిని కొనసాగించలేని పరిస్థితి మాది. కార్మికులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందచేసి చేనేత కార్మికులకు ప్రభుత్వం జీవనభృతి కల్పించేలా చూస్తే బాగుంటుంది" అని నేత కార్మికులు జేపీతో మొరపెట్టుకున్నారు.

జేపీ స్పందిస్తూ, నిరాశతో ప్రభుత్వం మీదే మొత్తం భారం వేయటం వల్ల మున్ముందు సమస్యలు పెరుగుతాయే తప్ప తగ్గవని అన్నారు. భృతి, పింఛన్లతో ఒరిగేదేమీ ఉండదన్నారు. చేనేత ద్వారా ఏమేరకు ఆదాయావకాశాలున్నాయో, ప్రభుత్వాన్ని ఎక్కడెక్కడ వినియోగించుకోవచ్చో ముందుకార్మికులకు స్పష్టత కావాలన్నారు. రాష్ట్రంలో 13 లక్షలమంది నేతకారులున్నారని వీరిలో ఎక్కువమంది తయారుచేస్తున్న చీరలకు మార్కెట్‌లో డిమాండ్ నిలకడగా లేదన్నారు. ప్రభుత్వం ఆప్కోపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటం వల్ల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. కార్మికులంతా దళారుల మీద ఆధారపడకుండా సొంతంగా ముడిసరకులను కొనుగోలు చేసి చీరలను నేయటం, సొసైటీలకు విక్రయించటం చేయాలని అన్నారు. ముద్ర రుణాలను జాప్యం లేకుండా కార్మికులకు అందించేలా చూడాలన్నారు. ఈ రుణాలకు సంబంధించి ప్రభుత్వం దగ్గర గట్టి ప్రయత్నం చేయవచ్చన్నారు.

చేనేత కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఆరోగ్య కార్డులిచ్చి క్రమం తప్పకుండా హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జేపీ అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలను బాగుచేస్తే కొత్త అవకాశాలు చేనేతకారులను వెతుక్కుంటూ వస్తాయని, నూతన పరిష్కారాలతో ఆదాయమార్గాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఇందుకోసం సురాజ్య యాత్ర ద్వారా తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. ప్రభుత్వం దృష్టికి నేతకారుల సమస్యల్ని తీసుకెళ్లి పరిష్కరించేందుకు గట్టిగా కృషి చేస్తానన్నారు. నిరాశను వీడి పరిష్కారంలో భాగం కావాలని సూచించారు.

మండల పరిషత్ అధ్యక్షుడు కె.నాగిరెడ్డి, విశ్రాంత తహసీల్దార్ సి.బి అజయకుమార్, సీపీఎం నాయకుడు కె.రాజు, సి.బి శ్రీను, బుడిగె వెంకటేశ్వర్లు, కాశన్న, మాధవస్వామి, మల్లేష్, రుష్యేంద్రబాబు, భీశెట్టి బాబ్జీ, రామ్మోహనరావు, గోవిందు, డేవిడ్, బలరాం, రాజ్యలక్ష్మి, పద్మన్న, డా॥ నాగరాజు, ఎస్.ఎం బాషా, సోమమోహన్, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✦

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ భారతదేశం 'ఎన్నికలు మాత్రమే' జరిగే ప్రజాస్వామ్య దేశంగా పరిణమించే ప్రమాదంలో ఉన్నది! ఈ శోచనీయ వ్యవహారంలో మీడియాది ప్రధాన పాత్ర. వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్, ఇప్పుడు వెబ్‌సైట్లు ఎన్నికల పట్ల మితిమీరిన శ్రద్ధ చూపుతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక, కులసమీకరణాలు, ప్రచార వ్యూహాలు, నాయకత్వ శైలులు మొదలైన అంశాలకే మీడియా అపరిమిత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ఎన్నికలు ముగిసి, ఒక నిర్దిష్ట పార్టీ విజయం సాధించిన వెన్వెంటనే మీడియా తన దృష్టిని పాలనా ప్రక్రియ నుంచి వేరే తావులకు మళ్లిస్తోంది. ఒక ప్రభుత్వం అధికారంలో ఉండే ఐదేళ్లూ ప్రజల శ్రేయస్సుకు ఏం చేస్తుందీ లేదా ఏమి చేయడం లేదు అన్న విషయమై మీడియా శ్రద్ధ చూపడమే లేదు. ఎన్నికలకు ఎన్నికలకు మధ్య ఏం జరుగుతుందనేది చాలా చాలా ముఖ్యం.

– (కర్ణాటక ఎన్నికల సందర్భంగా) రామచంద్ర గుహ, చరిత్రకారులు

★ ఇవాళ రాజకీయ నాయకులతోపాటు న్యాయమూర్తులు కూడా తమకు దేశంలో తెలియనిది లేదని అనుకుంటున్నారు. దేవుడు వారి ముందుకు వచ్చినా ఆయనను జైలుకు పంపే పరిస్థితి ఇప్పుడు నెలకొన్నది. మన తొలి దళిత రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్ దౌత్యవేత్తగా ఉన్నప్పుడు ఆయన కూతురు రిజర్వేషన్ ద్వారా విదేశాంగ సర్వీసులో ప్రవేశించారట. ఈ విషయం ఒక విలేకరి ప్రశ్నించినప్పుడు పదివేల సంవత్సరాల నుంచీ దళితులు దోపిడీకి గురవుతున్నారని ఆయన చెప్పారట. ఆయన చెప్పేది నిజమే. కానీ మనకు అవసరంలేని రిజర్వేషన్లు ఇతరులకు లభించేలా ఎందుకు చేయకూడదు?

– చంద్రశేఖర కంబార, ప్రముఖ భారతీయ కవి, నాటక రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు

★ నలుగురికి క్షమాపణలతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విశ్వసనీయత కోల్పోవడంతో ఓ ఆదర్శ రాజకీయ వేదికగా ఆప్ బలహీనమైంది. జైట్లీ–ఢిల్లీ క్రికెట్ క్లబ్ సంబంధం పైన, పంజాబ్‌లో మాదకద్రవ్యాలకు మజీఠియాకు ఉన్న వ్యవహారం పైన తాను చేసిన ఆరోపణలను కేజ్రీవాల్ నిరూపించుకోలేకపోయారు. ఆయన పై ఇంకా ఇలాంటి కేసులు చాలా ఉన్నందున పరిపాలన పై దృష్టి పెట్టడానికే ప్రత్యర్థులకు కేజ్రీవాల్ క్షమాపణ చెప్పారని సమర్థించుకోవడం తేలికే. అయితే, కేజ్రీవాల్ ఇతర రాజకీయ నాయకుల మాదిరి ఎదిగిన నేత కాదు. ఆయన అనుసరించిన కొత్త తరహా రాజకీయాలను ఓడించడానికి అన్ని పార్టీలూ రహస్యంగా చేతులు కలిపాయి. కాబట్టి ఇప్పుడు కేజ్రీవాల్ క్షమాపణల కారణంగా అన్ని పక్షాలూ లబ్ధిపొందుతాయి.

-మహేష్ విజాపుర్కర్, సీనియర్ జర్నలిస్టు

★ అశోక స్తంభం మీద ఉన్న నాలుగు సింహాల్లో మూడే కనిపిస్తాయి. నాలుగోది కనిపించదు. అయితే నాలుగో సింహం కనిపించదు కాబట్టి అది లేదనుకోవడం పొరపాటే! అటువంటి నాలుగో సింహమే తెలంగాణ వైద్యరంగ ఆణిముత్యం డాక్టర్ ఐతరాజు పాండురంగారావు.

- డాక్టర్ బాలాజీ ఊట్ల, సీఈవో, క్రియ హెల్త్‌కేర్

★ మేం ఎంతో కష్టపడి నివేదిక రూపొందించినప్పటికీ వీఐపీలు తప్పించుకుపోతున్నారు. ఏ వ్యక్తి, ఏ కంపెనీ పట్ల పక్షపాతం చూపకుండా డాక్యుమెంట్లు సహా నివేదికను విడుదల చేశాం. లోకాయుక్త సమర్పించిన సాక్ష్యాధారాలకే విలువ లేకపోతే మొత్తం న్యాయవ్యవస్థనే సమీక్షించుకోవాలి.

– (గత రెండేళ్ల నుంచి మైనింగ్ కింగ్ గాలి జనార్ధన రెడ్డిపై ఉన్న కేసుల మూసివేతకు కేంద్ర స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంపై) జస్టిస్ సంతోష్ హెగ్డే, కర్ణాటక మాజీ లోకాయుక్త

★ సంపద తమ చేతుల మీదుగా ఖర్చుకావాలన్న పంతమే రాజకీయ పార్టీల్లో కనిపిస్తోంది తప్ప మరో గొప్ప ఆదర్శం, ఆలోచన కనిపించటం లేదు. 'ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదు, తమ డిమాండ్లను గుర్తించడం లేదు, తెలంగాణ తెచ్చింది ఎవరో అనుభవించడానికి కాదు'.. లాంటి మాటలు అపరిపక్వ మానసిక స్థితిని తెలియజేస్తాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి మాటలకు ప్రాసంగికత అసలే కనిపించదు. ప్రజలు సృష్టిస్తున్న సంపద సజావుగా వారి కోసమే ఖర్చవుతున్నదా? పక్కదారి పడుతున్నదా? అన్న విషయంపై దృష్టి నిలపడాన్ని మించిన గొప్ప ప్రజాసేవ మరొకటి ఉండదు. ప్రజల నైపుణ్యాలు పెంచే ఆలోచన చేయాలి. పరిపాలన, సంపదసృష్టి, పంపిణీలోని కీలక అంశాలపై దృష్టి నిలిపితే నిజమైన చైతన్యం తొణకిసలాడుతుంది. పాలనలో పట్టువిడుపుల గూర్చి అవగాహన లేకుండానే అధికార పగ్గాలు చేపట్టాలన్న కాంక్షతో కొత్తపార్టీలు పెట్టడం వల్ల ప్రజలకే నష్టం.

- వుప్పల నరసింహం, సీనియర్ జర్నలిస్టు

*★ రాష్ట్రాలని ప్రాంతీయవాదపు దీవులుగా మలచడం భారత్ ఒకే జాతి అన్న భావనకు ఆరోగ్యకరం కాదు. భారతదేశ రాష్ట్రాలను కలిపి ఉంచే శక్తి కలిగిన భావోద్వేగమేదీ లేదన్న అనుమానం నుంచి ఇది జనిస్తుంది. నిజానికి ఈ వ్యతిరేకత వాస్తవమే. ఒక జాతిగా మనం సురక్షితంగానే ఉన్నాం. దేశం మరింత బలమైన సమాఖ్యగా ఎదగడానికీ, మరింతగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్రాలకు అవకాశం కల్పించడానికీ సమయం ఆసన్నమైంది.*


*– టీఎస్ సుధీర్, సీనియర్ విశ్లేషకులు*

★ సుమారు పాతికేళ్ల కిందట ఆర్థిక సంస్కరణలను పట్టాలెక్కించినప్పుడు అవి ఎంతకాలం మన్నుతాయన్న చర్చ జోరుగా సాగింది. స్థానిక సంస్థలను సవ్యంగా తీర్చిదిద్దితే తప్ప ఆర్థిక సంస్కరణలకు దీర్ఘకాలిక మన్నిక ఉండదని నిపుణులందరూ ఆనాడు సూచించారు. దురదృష్టవశాత్తూ ఇంటిని చక్కదిద్దుకునే సంస్కరణలపైన మన విధానకర్తలు పాతికేళ్లుగా పెద్దగా దృష్టి సారించలేకపోయారు. మొత్తంగా ప్రభుత్వ వ్యయంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు చేసే కేటాయింపులు చైనాలో 50 శాతం కాగా, దక్షిణాఫ్రికాలో 28 శాతం, బ్రెజిల్‌లో 20 శాతంగా ఉన్నాయి. భారత్‌లో ఇవి మూడు శాతం మాత్రమే కావడం గమనార్హం. జాతీయ గ్రామీణాభివృద్ధి కార్యక్రమం నిధులనూ జోడిస్తే ఈ కేటాయింపుల ఖర్చు ఆరు నుంచి ఏడు శాతం మధ్యలో ఉండవచ్చు. పద్నాలుగో ఆర్థిక సంఘం కేటాయింపులు పెంచిన నేపథ్యంలో ఈ మొత్తం ఆరు శాతానికి అటు ఇటుగా ఉండవచ్చునని అంచనా! సాధ్యమైనంతవరకూ గ్రామపంచాయతీలను పట్టణ పురపాలికలలో కలిపేయాలన్న లోపాయకారి ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. పంచాయతీలతో పోలిస్తే పురపాలికలతోనే ప్రభుత్వాలకు ఎక్కువ సానుకూలత ఉండటం ఇందుకు కారణం! బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనా వంటి దేశాల్లో స్థానిక సంస్థల బలోపేతానికి విస్తృతంగా నిధుల కేటాయింపు జరుగుతుంటే– భారత్ మాత్రం ఈ విషయంలో తీవ్రమైన వెనకబాటులో ఉండటం బాధాకరం.

– పరిటాల పురుషోత్తం, 'సెస్'లో ఆచార్యులు

*(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, సోషల్ మీడియా)*

# నిరుద్యోగ భృతి, పింఛన్లకు మోసపోవద్దు



### పాఠశాలకు ప్రశంస

పత్తికొండలో పెంకుటింట్లో ఉన్న ఆది ఆంధ్రా పాఠశాలను సందర్శించిన జేపీ.. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. చక్కని ఆంగ్లంలో విద్యార్థులు జేపీకి సమాధానాలిచ్చారు. చాలా ప్రభుత్వ పాఠశాలలకు భిన్నంగా.. ఈ స్థాయి విద్యా ప్రమాణాలను ప్రదర్శించటం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్యను జేపీ అభినందించారు. అనంతరం లోక్‌సత్తా నేత రామ్మోహన్ సమకూర్చిన నోట్ పుస్తకాలు, బట్టలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

విద్య ఏ ఒక్కరి సొత్తు కాదని, ప్రతి బిడ్డా నాణ్యమైన ఉన్నత చదువులు చదవాలని జేపీ అన్నారు. అందరూ సమానస్థాయికి ఎదగకపోవచ్చుని, కానీ ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశాలు సమానంగా ఉండాలని అన్నారు.

కర్నూలు జిల్లా సురాజ్య యాత్రలో భాగంగా జేపీ పత్తికొండలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలని సందర్శించారు. విద్యార్థులతో చదువులు, ఇతర అంశాలపై చర్చించారు.

కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివితేనే మంచి చదువు వస్తుందనే వాతావరణం వల్ల విద్యారంగం తీవ్రంగా దెబ్బతింటోందని, భావితరాల ఎదుగుదల ఒడిదుడుకులతో పరిమితమవుతోందని జేపీ అన్నారు. ప్రభుత్వమే విద్య, వైద్యరంగాలను పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సర్కారీ వైద్యశాలల్లో జనాభాకనుగుణంగా వైద్యులు, ఇతర సిబ్బంది, మందులు తదితర సదుపాయాలు కల్పిస్తే పేదలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి లక్షల్లో వైద్యానికి ఎందుకు ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. చదువంటే కేవలం మార్కులు ర్యాంకుల కోసం కాదని, చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుంటూ సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రయత్నించటం కూడానని అన్నారు. రైతులు పండించిన పంటకు డిమాండ్ ఉన్నా సరే గిట్టుబాటు ధరను కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, రోజూ కర్నూలు మార్కెట్ నుంచీ వచ్చే విద్యార్థులు ఈ విషయాన్ని పట్టించుకోవాలని జేపీ అన్నారు. వ్యవసాయరంగాన్ని లాభసాటి చేయటం పూర్తిగా సాధ్యమని, ప్రభుత్వాల విధానాలలోనే లోపముందని అన్నారు.

ఏపీలో ప్రభుత్వం ప్రజలకు అవసరమైన పనులు చేయకుండా, ఉపాధి పెరిగే పరిస్థితుల్ని కల్పించకుండా 35–45 ఏళ్ల వరకు నిరుద్యోగ భృతి అంటుంటే, ప్రతిపక్ష పార్టీ 45 ఏళ్లు దాటాక పింఛన్లు అంటోందని, ఇది యువతను కించపరచటమేనని జేపీ అన్నారు. లక్షలు ఖర్చు పెట్టి ఎన్నో ఆశలతో చదువుకున్న విద్యార్థులు రైతుకుటుంబాల్లో ఉన్నారని, వారంతా ఉద్యోగాలు కోరుకుంటున్నారు తప్ప నిరుద్యోగ భృతిని కాదని అన్నారు. ఆ మోసపూరితమైన వాగ్దానాల పట్ల యువత, ఇతర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను ఆరు మౌలిక రంగాల్లో తెలుసుకుని పరిష్కారాలతో ప్రభుత్వానికి అందించేందుకు, సాధించేందుకు సురాజ్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు.

పత్తికొండలో ప్రభుత్వ వైద్యసేవలను జేపీ పరిశీలించారు. ప్రజారోగ్యాన్ని ఒక క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తున్నారని, అందరికీ ఆరోగ్య విధానాన్ని అమలుచేస్తేనే రాష్ట్ర, దేశాభివృద్ధికి గట్టి పునాది పడుతుందని అన్నారు.

జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, రామ్మోహనరావు, బాజ్జీ, రాజ్యలక్ష్మి, వైబీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు. ✦

పోటీ పరీక్ష ఏదైనా... రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు

THE NARAYANA GROUP

# నారాయణ తిరుపతి డివిజన్‌కే సొంతం

## అత్యద్భుతం.. అపురూపం.. అనిర్వచనీయం...

**EAMCET & MAIN ఫలితాలలో తిరుపతి నారాయణ విద్యార్థుల విజయభేరి...**

రాష్ట్ర స్థాయిలో రాయలసీమ ప్రాంతంలో మరియు తిరుపతి పట్టణంలో IIT ఇంజనీరింగ్, మెడికల్ ( NEET ) ఫలితాలలోఅత్యుత్తమ ర్యాంకుల పంట నారాయణ విద్యార్థులదే. ఉన్నత స్థాయి అధ్యాపక బృందం, పటిష్ఠమైన విద్యా ప్రణాళిక, ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలనే దీక్ష నారాయణ సొంతం. విద్యార్థుల కఠోర పరిశ్రమకు తోడు, అధ్యాపకుల కృషి ఫలితమే ఈ విజయం.

నాడు మార్కులైన.... నేడు గ్రేడులైన .... సంచలన విజయాలు ఒక్క నారాయణకే సాధ్యం

## IPE – 2018 RESULTS

**JR MPC**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 242 |
| ABOVE 9.8 | 417 |
| ABOVE 9.7 | 571 |
| ABOVE 9.5 | 688 |
| ABOVE 9.0 | 987 |

**JR BIPC**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 30 |
| ABOVE 9.8 | 48 |
| ABOVE 9.7 | 58 |
| ABOVE 9.5 | 71 |
| ABOVE 9.0 | 110 |

**SR MPC** — TOP MARK 988

| RANGE | STRN |
|---|---|
| ABOVE 980 | 59 |
| ABOVE 970 | 192 |
| ABOVE 960 | 331 |
| ABOVE 950 | 458 |
| ABOVE 940 | 604 |
| ABOVE 900 | 1047 |

**SR BPC** — TOP MARK 988

| RANGE | STRN |
|---|---|
| ABOVE 980 | 4 |
| ABOVE 970 | 23 |
| ABOVE 960 | 38 |
| ABOVE 950 | 43 |
| ABOVE 940 | 53 |
| ABOVE 900 | 93 |

**SSC 2018 RESULT**

| RANGE | STRN |
|---|---|
| 10 GPA | 244 |
| ABOVE 9.8 | 429 |
| ABOVE 9.7 | 596 |
| ABOVE 9.5 | 777 |

## EAMCET & JEE-MIAN 2018 RESULTS

BEST STATE RANK IN AP EAMCET - 155
BEST RANK IN JEE-MAIN IN ALL INDIA - 161*

NO. OF STUDENTS BELOW 1000 RANK IN AP EAMCET- 9
NO. OF STUDENTS QUALIFIED IN JEE-MAIN - 270

**JEE-MAIN TOP RANKERS**

M. CHANDU HT–11614675 RANK-161
P.S. SAINATH HT–11603307 RANK-192
P. SAI DHARANI HT–11615065 RANK-431
K. ASHRAF HT–11612238 RANK-650
P. GURUNADH HT–11608094 RANK-789
H. MADHAN HT–11607980 RANK-2566
E.S. YASHWIN HT–11604360 RANK-11333
S.V.L ROSHINI HT–11603652 RANK-12255
R.MALLIKARJUNA HT–11601596 RANK-15297
N. NEHA HT–11615351 RANK-17243
M. JASWANTH HT–11614669 RANK-18419
M. RAJA SEKHAR HT–11612541 RANK-19932


**AP EAMCET TOP RANKERS**

KAASYAP SRIRAM HT–5816322724 RANK-155
G.LAKSHMI KIRANMAYI HT–582632258 RANK-261
K. SAI HARISH HT–5816324497 RANK-419
P.S. SAINATH HT–9836323149 RANK-461
V. PRASANNA LAKSHMI HT–5826322912 RANK-508
E.S. YASHWIN HT–9846322187 RANK-606
P. GURUNADH HT–9846321153 RANK-705
H. MADHAN HT–9846324103 RANK-724
S.V.L ROSHINI HT–9826322643 RANK-964

**MPC**

N120

JEE అడ్వాన్స్‌డ్‌లో 100 లోపు టాప్ ర్యాంకులే లక్ష్యంగా రూపుదిద్దిన సంచలనాత్మక ప్రోగ్రామ్




**BIPC**

N40

NEET మెడికల్‌లో 100 లోపు టాప్ ర్యాంకులే లక్ష్యంగా నారాయణ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రోగ్రామ్

CONTACT : IIT COLLEGE - 8179880574, 0877-2284840, MEDICAL ACADEMY – 7337337069, 0877-2284811 - TIRUPATI







# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జేపీ అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేసి సహజసిద్ధమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ విభాగం ఆధ్వర్యంలో తయారుచేసిన జ్యూట్ బ్యాగులను హైదరాబాద్‌లోని కార్యాలయంలో జేపీ ఆవిష్కరించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూకట్‌పల్లిలో పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వంశీప్రసాద్, నగర ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, కార్మికసత్తా నేత కొండల్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి సుబ్రహ్మణ్యం, జీహెచ్‌ఎంసీ కార్యదర్శి  వర్మ, నేతలు కటారి శ్రీనివాసరావు, ఎన్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

Posting Date 22-05-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May 16th, 2018

# మెరుగైన సమాజ నిర్మాణంలో మాకు స్ఫూర్తి జేపీ



'భరత్ అనే నేను' స్క్రిప్ట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా జేపీగారిని రెండుసార్లు కలిశాను అద్భుతమైన విషయాలు చెప్పారు. We need you to inspire us in building a better society JP Sir

- కొరటాల శివ, చిత్ర దర్శకులు

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad